నవతెలంగాణ
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
సోమవారం | సెప్టెంబర్ 04 2023 | www.navatelangana.com

మూడు రాష్ట్రాల ఖోఖో పోటీలలో తెలంగాణ జట్టు విజయం



నవతెలంగాణ-తొగుట

మూడు రాష్ట్రాల కోకో పోటీలలో తెలంగాణ జట్టు విజయం సాధించడం అభినందనియం. ఆదివారం హైదరాబాద్‌లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ కర్ణాటక రాష్ట్రాలకు సంబంధించి ఖోఖో పోటీలు నిర్వహించారు. ఈ ఆటలలో తెలంగాణ జట్టు విజయం సాధించింది. తెలంగాణ జట్టులో మండలంలోని గుడికందుల గ్రామానికి చెందిన ఉప సర్పంచ్ మళ్లగారి శ్రీకాంత్ రెడ్డి కూతురు మల్లు గారి శ్రీనిధి తడ్కపల్లి అవాస విద్యాలంలో 8వ తరగతి విద్యానభ్యసిస్తుంది. మండలానికి చెందిన విద్యార్థిని తెలంగాణ తరపున ఆటలలో పాల్గొని విజయం సాధించడం గర్వకారణమని హర్షం వ్యక్తం చేస్తున్నారు. విషయం తెలుసుకున్న మండ ల ప్రజలు నాయకులు శ్రీనిధికి శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

మహంకాళి ఆలయానికి లక్ష విరాళం



నవతెలంగాణ
కొమురవెల్లి

మండలంలోని కిష్టంపేట గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న మహంకాళి ఆలయానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మొగుళ్ళ రాజిరెడ్డి లక్ష రూపాయలు నగదు విరాళంగా ఆలయ కమిటీకి ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ దుర్గారెడ్డి, యువ నాయకులు బొంగు రాజేందర్ రెడ్డి, జే మల్లారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రవీందర్ రెడ్డి, బి నాగిరెడ్డి, యాదిరెడ్డి, తిరుపతిరెడ్డి, బి చంద్రశేఖర్ రెడ్డి, నరసింహారెడ్డి, బొంగు తిరుపతి రెడ్డి తదితరులు ఉన్నారు.

పెంచిన నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు దాసరి కళావతి
- సీపీఐ(ఎం)ఆధ్వర్యంలో నరేంద్ర మోడీ దిష్టిబొమ్మ దహనం







నవతెలంగాణ-చేర్యాల

పెంచిన నిత్యావసర వస్తువుల ధరలను వెంటనే తగ్గించాలని సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు దాసరి కళావతి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెంచిన ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం) చేర్యాల పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణ కేంద్రంలోని పాత బస్ స్టాండ్ వద్ద ప్రధాని నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. అనంతరం కళావతి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిత్యావసర సరుకుల ధరలను విపరీతంగా పెంచి ప్రజలపై భారాలు మోపు తుందని, వెంటనే పెంచిన ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. గత తొమ్మిది సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్, భూస్వామ్య విధానాలను అమలు చేస్తూ నూటికి 90 శాతం గా ఉన్న పేద, మధ్యతరగతి, కార్మిక, కర్షక వర్గాల ప్రజల అవసరాలను, సంక్షేమాన్ని పూర్తిగా మరిచిపోయి దేశంలోని బడా కార్పొరేట్ శక్తులకు దోచి పెడుతుందని విమర్శించారు.ప్రభుత్వ రంగ సంస్థలన్నింటిని బడా కార్పొరేట్లకు అప్పజెప్పి ప్రజల మీద అనేక భారాలు మోపుతున్నారని, విద్యా, వైద్యం ప్రైవేటు పెట్టుబడిదారులకు ధారాదత్తం చేయడం వల్ల పేద లకు విద్యా వైద్యం దూరమైందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి రాళ్ల బండి నాగరాజు, బండ కింది అరుణ్ కుమార్, ఇప్పకాయల శోభ, ఆముదాల రంజిత్ రెడ్డి, బోయిని మల్లేశం, రాళ్ల బండి భాస్కర్ ,మేర్గోజు సత్యనారాయణ, రాళ్ల బండి చందు, మేర్గోజు రామచంద్రం, మంచాల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

చుంచనకోటలో మోడీ దిష్టిబొమ్మ దహనం

కేంద్ర ప్రభుత్వం పెంచిన నిత్యవసర సరుకుల ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం)ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యుడు గొర్రె శ్రీనివాస్, నాయకులు పండుగ యాదగిరి, భీమరాజు, గుంటి కనకయ్య, కొమ్ము బాలయ్య, గుడ్ల మైసయ్య, బింగి రాజు తదితరులు పాల్గొన్నారు.

మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు నశించాలి

నవ తెలంగాణ సిద్దిపేట అర్బన్

పాత బస్టాండ్ శాఖ ఆధ్వర్యంలో బీజేపీ కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మోడీ దిష్టిబొమ్మను అంబేద్కర్ నగర్ 19 వార్డ్ చౌరస్తా రోడ్డు ప్రాంతంలో ఆదివారం దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం పాత బస్టాండ్ శాఖ 19వ వార్డు కార్యదర్శి కొండం సంజీవ్ కుమార్ మాట్లాడుతూ 'నేడు కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం గత తొమ్మిది సంవత్సరాలుగా కార్పొరేటు భూస్వామ్య విధానాలను అమలు చేస్తూ నూటికి 90 శాతం గా ఉన్న పేద మధ్యతరగతి కార్మిక కర్షక వర్గాల ప్రజల అవసరాలను సంక్షేమాన్ని పూర్తిగా మరిచిపోయి దేశంలోని బడా కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతుంది. కార్మికులను నూతన కార్మిక చట్టాల పేరుతో పాత చట్టాలను రద్దుచేసి కొత్తగా నాలుగు కోడ్లను ప్రవేశపెట్టి కార్మికుల పనిగంటలు పెంచి కనీస వేతనాలను అమలు చేయకుండా వ్యవహరిస్తున్నది. దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ సేవా రంగ సంస్థలన్నీటిని బడా కార్పొరేట్లకు అప్పజెప్పి ప్రజల మీద అనేక భారాలు మోపుతున్నారని విద్యా వైద్యము ప్రైవేటు పెట్టుబడిదారులకు ధారాధత్తం చేయడం వల్ల పేదలకు విద్యా వైద్యం దూరమైంది. విద్యుత్తు ప్రైవేటీకరణతో రైతుల బోరుబావిలకు మీటర్లు బిగించాలని రైతులను వ్యవసాయం నుండి దూరం చేయాలని కుట్రలు చేస్తోంది. రైతులు పండించే ధాన్యాన్ని అమ్ముకోకుండా మార్కెట్లను లేకుండా చేస్తూ మద్దతు ధరను అమలు చేయడం లేదు. ప్రజా పంపిణీ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసిందని గతంలో 14 రకాల నిత్యవసర సరుకులను రేషన్ దుకాణాల ద్వారా పేదలకు అందించేదని ఈ బీజేపీ ప్రభుత్వం వచ్చినంక నిత్యవసర వస్తువుల ను ప్రజా పంపిణీ వ్యవస్థను బలహీనపరిచింది. నిరుద్యోగం దేశంలో రోజురోజుకు పెరుగుతుందని ఆకలి చావులు పెరిగిపోతున్నాయి. దేశంలో మతోన్మాదాన్ని పెంచి పోషిస్తూ మైనార్టీ ప్రజలైన క్రైస్తవులంపైన ముస్లింల పైన గిరిజనుల పైన మహిళల పైనమారణ హెూమం సృష్టిస్తుంది. మణిపూర్‌లో జరుగుతున్న మారణ హెూమాన్ని ప్రోత్సహిస్తుంది తప్ప నిలిపివేయడానికి ఏ చర్యలు తీసుకోవడం లేదు. భారతదేశంలోని అటవీ సంపదను ఖనిజ సంపదను రైతుల వ్యవసాయ క్షేత్రాలను భూములను మొత్తం దేశంలోని బడా పెట్టుబడిదారులైన అంబానీ, అధాని, టాటా, బిర్లా, మఫత్ లాల్ లాంటి ప్రైవేటు పెట్టుబడిదారులకు దారాదత్తం చేసి దళితుల పైన గిరిజనుల పైన ముస్లింలపై, మహిళలపై దాడులు చేయిస్తూ భారతదేశ మతసామరస్యాన్ని లౌకికత్వాన్ని మంట కలుపుతూ అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని రద్దుచేసి మనువాదాన్ని భారత దేశంలో అమలు చేయాలని కుట్రలు పన్నుతు వివిధ మతాల ప్రజలు గల ఈ భారతదేశాన్ని హిందూ దేశంగా మార్చాలని చరిత్రను వక్రీకరిస్తూ ప్రశ్నిస్తున్న వారిని నిర్దాక్షణ్యంగా జైళ్లకు పంపుతూ నిరంకుశంగా వ్యవహరిస్తున్నది. బిజెపి నరేంద్ర మోడీ విధానాలను దేశంలోని పేద మధ్యతరగతి కార్మికులు రైతులు వ్యవసాయ కూలీలు వృత్తిదారులు ఎస్సీ ఎస్టీ మైనార్టీ ప్రజలంతా ఏకమై మోడీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పే విధంగా పోరాటాలను ఉధృతం చేయాలి. సీపీఎం నిర్వహించే ఈ పోరాటాల్లో పీడిత ప్రజలంతా ఐక్యం కావాలి. పెద్ద ఎత్తున పోరాటాల్లో పాల్గొని నరేంద్ర మోడీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి' అని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శాఖ కమిటీ సభ్యులు చెప్పాల బాలమని చెప్పాలా ఉమామహేశ్వరి చెప్పాల నట్రాజ్ పెర్క అర్చన తదితరులు పాల్గొన్నారు.

మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు నశించాలి

నవ తెలంగాణ కొమరవెల్లి

నరేంద్ర మోడీ ప్రజా వ్యతిరేక విధానాలను మానుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని రామ్ సాగర్ గ్రామంలో సీపీఎం గ్రామ శాఖ ఆధ్వర్యంలో నరేంద్ర మోడీ బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి సత్తిరెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం గత తొమ్మిది సంవత్సరాలుగా కార్పొరేట్ శక్తులకు అనుకూల నిర్ణయాలు తీసుకుంటూ పేదల సొమ్మును బడ బాబులకు దోచిపెడుతుందని మండిపడ్డారు. నూటికి 90 శాతంగా ఉన్న పేద మధ్యతరగతి కార్మిక కర్షక వర్గాల సంక్షేమాన్ని పూర్తిగా మర్చిపోయి మోడీ ప్రభుత్వం పాలన చేస్తుందన్నారు కార్మికులకు నూతన కార్మిక చట్టాల పేరుతో పాత చట్టాలను రద్దుచేసి కొత్తగా నాలుగు లేబర్ కోర్డులను ప్రవేశపెట్టి కార్మికుల పని గంటలు పెంచి కనీస వేతన అమలు చేయకుండా యాజమాన్యాలకు అనుకూల చట్టాలు తీసుకువచ్చి కార్మికుల కు తీవ్రమైన అన్యాయం చేశారన్నారు ప్రజా పంపిణీ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసిందని గతంలో 14 రకాల నిత్యవసర సరుకులను రేషన్ దుకాణాల ద్వారా పేదలకు అందించేవారని బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా పంపిణీ వ్యవస్థను బలహీనపరిచిందని దేశంలో నిరుద్యోగము రోజురోజుకు పెరిగిపోతుందని, ఆకలి చావులు పెరిగిపోతున్నాయని అన్నారు ప్రజలంతా ఏకమై మోడీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పే విధంగా పోరాటాలను ఉధృతం చేయాలని సిపిఎం పార్టీ నిర్వహించే పోరాటాల్లో ప్రజలంతా ఐక్యంగా పాల్గొని మోడీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో రాంసాగర్ సర్పంచ్ తాడూరు రవీందర్, నాయకులు దాసరి మహేష్, నీల బిక్షపతి, తాడూరు రవీ, గణేష్, తాడూరు అనిల్, కుమార్, ప్రకాష్ ,చిన్న నరసయ్య, ఏదుల కిరణ్ తదితరులు పాల్గొన్నారు

ఆకట్టుకుంటున్న ఇగ్లూ థియేటర్





- పల్లెటూరులో 100 సీట్ల సినిమా థియేటర్
- రోజుకు నాలుగు షోల ప్రదర్శన
- ఎస్కిమోలు నిర్మించే ఇండ్ల తరహా ఇగ్లూ థియేటర్

నవతెలంగాణ-కోహెడ

వినోద రంగంలో ఘననీయమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఓటీటీ లాంటి ప్లాట్‌ఫామ్‌లు రావడంతో సినిమా థియేటర్ లాంటివి నిర్మించేందుకు పెట్టుబడులు పెట్టేందుకు సంకోచిస్తున్నారు. ఒకవేళ ఎవరైన ముందుకువచ్చిన అది నగరాలకే పరిమితమవుతుంది. ఏదైనా సినిమాకు వెళ్లాలంటే గ్రామీణ ప్రాంతాలలో నివసించే వారు సుమారు 30 నుండి 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న కరీంనగర్, సిద్దిపేట జిల్లా కేంద్రాలకు వెళ్లి సినిమా చూసి వచ్చే పరిస్థితి. అదే వయస్సుపై బడిన వారైతే ఇక మేం రాలేం అని చెప్పేవారు. మరీ మారాం చేస్తే మీరే జర జాగ్రత్తగా వెళ్లిరండి బిడ్డ అంటూ వారి పిల్లలను పంపించే పరిస్థితి ఉండేంది. మా మండలంలోనే ఒక సినిమా థియేటర్ ఉంటే ఇంటిల్లిపాది అందరం వెళ్లి చూసేవాళ్ళం కదా అనిపించేది. వినోదాన్ని ముంగిట్లోకి తెచ్చుకునేందుకు గాను సిద్దిపేట జిల్లా కోహెడ మండల కేంద్రంలో కూరెళ్ళకు వెళ్ళే దారిలో అర ఎకరా స్థలంలో ఇటీవల ప్రారంభించిన ఇగ్లూ (శ్రీ వెంకటేశ్వర) సినిమా థియోటర్ ఇక్కడి ప్రజలను ఆకట్టుకుంటుంది.

ఎస్కిమోలు నిర్మించే ఇండ్ల తరహా ఇగ్లూ థియేటర్

మంచు ప్రాంతాలలో నిర్మించే ఎస్కిమోలు నిర్మించే ఇండ్ల తరహా ఇగ్లూను తలపిస్తున్న ఈ థియేటర్ సరికొత్త అనుభూతిని పంచుతుంది. గ్రామీణ ప్రాంతాలలో సిటీ మోడల్‌లో ఏర్పాటు చేసిన ఇక్కడి వసతులు సూపర్ అని చెప్పవచ్చు. లోపలి ప్రదేశం క్రాస్ స్క్రీన్‌తో, సరికొత్త వెలుగుల లైటింగ్స్‌తో మైమరిచిపోయే వాతావరణాన్ని అలుముకుంటుంది. అలాగే హై క్వాలిటీ సౌండ్ సిస్టమ్, ఏ ప్రదేశంలో కూర్చున్న అనువైన విధంగా స్క్రీన్ కనిపిస్తుందని ప్రేక్షకులు చెబుతున్నారు. మండల కేంద్రంలో కొద్ది సంవత్సరాల క్రితం రెండు థియోటర్‌లు ఉండేవి. పెద్ద థియోటర్‌లు కావడంతో పాటు రిలీజ్ సినిమాలు రాకపోవడంతో అప్పటి పరిస్థితులలో అనుకున్న రీతిలో ప్రేక్షకుల ఆదరణ తక్కువగా ఉండేది. ప్రస్తుత జీవన విధానంలో ఇక్కడి ప్రజలకు వినోదాన్ని అందించాలనే ఉద్దేశ్యంతో నిర్మించిన 100 సీట్ల సామర్థ్యంతో పాటు వృత్తం ఆకారంలో నిర్మించబడిన ఈ



థియోటర్ రోజుకు నాలుగు ఆటలను ప్రదర్శిస్తూ ఇక్కడి ప్రేక్షకులను అమితంగా ఆకర్షిస్తుంది.

కొత్త ఆలోచనతో నిర్మించారు

ఫైబర్‌వుడ్ లాంటి సామాగ్రితో స్వల్పకాలిక వ్యవధిలోనె ఈ ఇగ్లూ థియోటర్ నిర్మించారు. ఇగ్లూ థియోటర్‌లో సినిమా చూస్తుంటే మల్టిఫ్లెక్స్‌లలో చూసిన అనుభూతి కలుగుతుందని ప్రేక్షకులు చెబుతున్నారు. 28 జూలై రోజున ప్రారంభించ బడింది. అలాగే పార్కింగ్, స్టాల్స్, చుట్టు పల్లె వాతావరణం ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. పెట్టుబడులు తగ్గించుకోవడమే కాకుండా గ్రామీణ ప్రాంతాలలో ఇలాంటి చిన్న థియోటర్‌లు అందుబాటులోకి వస్తే సినిమా వినోదం మారుమూలలకు అందిందని ప్రేక్షకులు చెబుతున్నారు.

పేటీఎం ఆన్‌లైన్ టికెట్ బుకింగ్

ఈ థియోటర్‌లో సినిమాను చూసేందుకు పే టీఎం ఆప్‌లో టికెట్‌లను బుకింగ్ చేసుకోవచ్చు. లేదా టికెట్ కౌంటర్‌లో తీసుకోవచ్చు. కుటుంబ సభ్యులంతా ఒకచోట చేరి సినిమా చూసిన అనుభూతిని కలుగుతుంది.

ఈవెంట్స్‌లకు కూడ బల్క్ బుకింగ్ ఇస్తాం



బర్త్ డే, మ్యారేజ్ డే, ఎంగేజ్‌మెంట్ తదితర ఫంక్షన్‌లకు కూడ బల్క్ బుకింగ్ ఇస్తాము. కుటుంబ సమేతంగా సినిమాను చూసి ఆనందంగా గడపవచ్చు. వినోదంతో పాటు ఇక్కడి వాతావరణం కూడ ఆహ్లాదంగా ఉండేలా మొక్కలను పెంచడం జరిగింది.

- 01 అఖి, థియోటర్ నిర్వాహకుడు

వినోదాన్ని అందించాలనే ఉద్దేశంతో..



గ్రామీణ ప్రాంతాలలో సైతం అందరికి వినోదాన్ని అందించాలనే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేశాము. ఈ థియోటర్‌లో సినిమా చూసిన ప్రేక్షకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలో సినిమా థియోటర్ ఓపెన్ చేయడం ఆనందంగా ఉంది.

- 02 నీల రవీందర్, థియేటర్ నిర్వాహకుడు

ఆహ్లాదకరం



థియోటర్ నిర్మించిన పరిసర ప్రాంతాలు స్వచ్ఛమైన గాలి, వెలుతురుతో ఆహ్లాదంగా ఉంది. సౌండ్ సిస్టమ్, లైటింగ్ అద్భుతంగా ఉంది. కొత్త సినిమాలను చూసేందుకు కరీంనగర్, సిద్దిపేటకు వెళ్ళే అవసరం లేకుండా పోయింది.

- 03 వేల్పుల సంపత్,
కోహెడ గ్రామస్థుడు









ఆకతాయిల ఆగడాలు

- ప్రాథమిక పాఠశాలలో మూత్ర విసర్జన చేస్తున్న గుర్తు తెలియని వ్యక్తులు
- గోడలు, బోర్డుపై అసభ్య చిత్రాలు, రాతలు

నవతెలంగాణ నార్సింగి

విద్య జీవితంలో ముఖ్యమైన అంశం. విద్య లేనివాడు వింత పశువు అని నానుడి. విద్య నేర్పే పాఠశాలలు దేవాలయాలతో సమానం. నార్సింగి పట్టణ కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలను గుర్తు తెలియని ఆకతాయిల ఆగడాలతో అపవిత్రం చేస్తున్నారు. పట్టణ కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (తెలుగు మాధ్యమం) భవనం శిథిలమై కూలిపోయే ప్రమాదం ఉన్నందున అధికారులు పక్కనే గల ఉర్దూ మీడియం ప్రాథమిక పాఠశాలకు తరలించారు. పాత పాఠశాలను నిర్మించే పనులు జరుగుతున్నాయి. ఉర్దూ మీడియం ప్రాథమిక పాఠశాల భవనానికి ప్రహరీ లేదు. కొన్ని రోజులుగా గుర్తు తెలియని ఆకతాయిలు బడి ముగిసిన అనంతరం పాఠశాల ఆవరణలోకి వచ్చి గోడలపై, బోర్డులపై అధ్యాపకుల గురించి అసభ్య చిత్రాలు, పదాలు రాస్తూ పిచ్చి చేష్టలు చేస్తున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాఠశాల పరిస్థితిని చూసి ఖంగు తింటున్నారు. గోడలపై, బోర్డుపై సిరా లాంటి ద్రవంతో అసభ్య గుర్తులు వేస్తున్నారు. పాఠశాల వరండాలో, పాఠశాల గది కిటికీ నుంచి గది లోపలకు మూత్ర విసర్జన చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. పాఠశాల మరుగుదొడ్ల తలుపులు ఊడ తీసి, నల్లా పైపులను ధ్వంసం చేశారు. ప్రధాన ఉపాధ్యాయురాలు మేరీ జోన్స్, శ్రీశైలం మాట్లాడుతూ కొద్ది రోజులుగా గుర్తు తెలియని ఆకతాయిలు పాఠశాలను అశుభ్రం చేస్తున్నారని, విద్యార్థులను పాఠశాల గదుల్లో కూర్చోబెట్టలేక పోతున్నామని వాపోయారు. మండల విద్యా అధికారి బుచ్యా నాయక్‌ను సంప్రదించగా ఈ సంఘటనపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తున్నామని తెలిపారు. పాఠశాలపై నిఘా ఉంచి ఆకతాయిలపై చర్యలు తీసుకుంటామన్నారు. వెంటనే కిటికీలను, మురుగుదొడ్ల తలుపులను, నీటీ పైపులను బాగు చేయిస్తామన్నారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి

- కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మాణిక్

నవ తెలంగాణ-సంగారెడ్డి



మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం యాపల్ ప్రాంతంలో చాకలి రాములు అనే యాజమానికి మేకల కాపరిగా ఉన్న తేజ అనే యువకుడిని తన స్నేహితుడు చిలుముల కిరణ్ అనే దళిత యువకులు మేకలు ఎత్తుకెల్లారని చెట్టుకు కట్టేసి తలకిందులుగా వేలాడదీసి కింద మంట పెట్టి చిత్రహింసలకు గురిచేసి అమానుషంగా దౌర్జన్యానికి పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మాణిక్ తెలిపారు. 'తేజ, కిరణ్‌లపై అనుమానం వచ్చి యజమాని నిలదీసి అడగగా మీ కాపరి తేజ సహకారంతోటే మేకను తీసుకువెళ్లామని నిజం ఒప్పుకున్నారు. చట్టం ప్రకారం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి. చట్టాన్ని తన చేతుల్లోకి తీసుకొని మధ్యయుగం కాలం నాటి అమానుషాలకు ఒడిగట్టడాన్ని తీవ్రంగా ఖండించాలి. దళితుడు నా మేకను దొంగలిస్తాడా అనే కుల దురహంకారంతో తలకిందులుగా కిరణ్ తేజను చెట్టుకి వేలాడదీసి చెట్టు కింద మంట పెట్టి చిత్రహింసలకు గురి చేశారని చెప్పారు. కిరణ్ తేజ ల తల్లిదండ్రులు మేక ఖరీదు రూ.3 వేలు చెల్లిస్తామన్నా వినకుండా దాడి చేశారు. అవమానం భరించలేక కిరణ్ ఎవరికి చెప్పకుండా పారిపోయాడు. తక్షణమే మేకల యజమాని చాకలి రాములుపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలి. మంచిర్యాల జిల్లాలో వరుస సంఘటనలు జరుగుతున్నాయి. జిల్లా పోలీసు యంత్రాంగం పెట్టాందారుల ఆగడాలను అరికట్టడంలో విఫలం అయ్యారు. జిల్లాలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. లేకుంటే బాధితుల పక్షాన పోరాటం చేస్తాం' అని హెచ్చరించారు. ఈ ఘటనను ప్రజాస్వామిక వాదులు ఖండించాలన్నారు.

గ్రామాల్లో సేవా కార్యక్రమాలు



నవతెలంగాణ -
చిన్నకోడూరు

గ్రామ సర్పంచిగా సామాల సునీతమధు ఉన్న రోజుల్లో గ్రామంలో అభివృద్ధి, సేవ కార్యక్రమాలు విస్తృతంగా చేసినట్లు కురుమ సంఘం గౌరవ అధ్యక్షులు బంటు శంకరయ్య అన్నారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం పెద్దకోడూరు గ్రామంలో సునీతమధును వచ్చే సర్పంచ్ ఎన్నికల్లో నిలబెట్టుతున్నట్లు కురుమ సంఘం గౌరవ అధ్యక్షులు శంకరయ్య తెలిపారు. గత ఎన్నికల్లో పోటీ చేసి ఆర్థికంగా నష్టపోయినందున, సర్పంచ్ గా పోటీ చేయడానికి కురుమ సంఘం నుంచి రూ.50 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించినట్లు తెలియజేశారు. సర్పంచ్ గా ఉన్న రోజుల్లో సామల సునీత మధు అభివృద్ధి కార్యక్రమాలు గ్రామంలో ఎన్నో చేసారనీ, నేటికీ సర్పంచ్ అంటే సామాల సునిత అని అన్నారు. వచ్చే సర్పంచ్ ఎన్నికల్లో సంఘం నుంచి పూర్తిగా మద్దతిస్తున్నట్లు తెలిపారు. వచ్చే సర్పంచ్ ఎన్నికల్లో సామల సునీత మధుకు పూర్తి స్థాయిలో మద్దతు తమ సంఘం నుంచి ఉంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు బట్టు తిరుపతి, ఉపాధ్యక్షుడు దేవయ్య, కార్యదర్శి శంకర్ బాబు, బర్మా శ్రీశైలం, కోశాధికారి రాజు పాల్గొన్నారు.

దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు సాధ్యం కాదు

- ఎన్నికల హామీలను అమలు చేయకుంటే బీఆర్ఎస్, బీజేపీ పతనం ఖాయం
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి



నవతెలంగాణ హుస్నాబాద్ రూరల్

దేశవ్యాప్తంగా ఒకే సారి ఎన్నికలు జరపడం అనేది తలకిందులుగా తపస్సు చేసిన వీలుగాని అంశమని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు. ఆదివారం హుస్నాబాద్ లో విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ జమిలి ఎన్నికల విధానం అనేది దేశంలో పాత విధానమేనని, దీనిపై ప్రధాని మోడీ కమిటీని వేస్తూ కొత్త విధానాన్ని తీసుకొస్తున్నామని అనడం విడ్డూరంగా వుందన్నారు. ఒకే దేశం,ఒకే పన్ను,ఒకే ఎన్నిక అన్న ప్రధాని పెట్రోల్ ఉత్పత్తులను పక్కదారి పట్టిస్తూ జీఎస్టీని ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. దేశంలో 28 పార్టీలు బిజెపి హటావో దేశ్ కి బచావో అనే నినాదంతో ముందుకు పోతున్నాయని అన్నారు. 30 శాతం ఓట్లున్న బిజెపి ప్రభుత్వన్నీ ఈసారి గద్దెదిగడం ఖాయమని చాడ వెంకటరెడ్డి జోస్యం చెప్పారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే పతనం ఖాయమని అన్నారు .ఈ కార్యక్రమంలో గడిపె మల్లేశ్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు యెడల వనేష్, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు కొయ్యడ కొమురయ్య ,ఏగ్గోజు సుదర్శన్ చారి, భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు గూడ పద్మ, తెలంగాణ దళిత హక్కుల పోరాట సమితి జిల్లా సహాయ కార్యదర్శి నేలవేని స్వప్న, నాయకులు అయిలేని మల్లారెడ్డి, వంగొజు భాస్కరా చారి, దండుగుల ఎల్లయ్య, దండుగుల రాజు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల స్పెషల్ డ్రైవ్



నవతెలంగాణ-చేర్యాల

పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత ఆదేశాల మేరకు ఆదివారం చేర్యాల పట్టణంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్లు చేర్యాల సీఐ సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా నెంబర్ ప్లేట్ సరిగా లేని 14 వాహనాలను గుర్తించి, ఒక మైనర్ వాహనాన్ని నడుపుతుండడంతో కౌన్సిలింగ్ ఇచ్చి జరిమానా విధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ భాస్కర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
2
సంగారెడ్డి
సోమవారం | 04 సెప్టెంబర్ 2023 | www.navatelangana.com

ఉచిత లెర్నింగ్ లైసెన్స్‌లు అందజేత



నవతెలంగాణ-కొండాపూర్

టీఎస్‌హెచ్‌డీసీ చైర్మెన్ చింత ప్రభాకర్ ఉచితంగా అందజేస్తున్న లర్నింగ్ లైసెన్సుల కార్యక్రమాన్ని మండల పరిధిలోని మల్లేపల్లి గ్రామంలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఏం.విట్టల్ హాజరై మాట్లాడారు. సంగారెడ్డి నియోజకవర్గంలోని ప్రతీ గ్రామంలో 18 ఏండ్లు నిండి ఉన్న యువతీ యువకులకు చింతా ప్రభాకర్ ఉచిత లైసెన్స్ ఇవ్వడం హర్షించదగ్గ విషయమన్నారు. ప్రజల మధ్యనే ఉంటూ నిరంతరం ప్రజాసేవలో మమేకమై.. 'అన్న అంటే నేనున్నా' అని ప్రజలకు ధీమాను ఇస్తున్న చింతా ప్రభాకర్‌కు యువత ఎల్లవేళలా తోడుగా ఉండాలన్నారు. లైసెన్స్‌లు అందజేసినందుకు చింత ప్రభాకర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పద్మావతి పాండురంగం, సర్పంచ్ శివలీలజగదీష్, ఎంపిటిసి పల్లె రాందాస్, ఉప్పసర్పంచ్ రామప్ప, గ్రామ శాఖ అధ్యక్షులు మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

కేతకిలో డీసీఎంఎస్ చైర్మెన్ ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-ఝరాసంగం

రాష్ట్రంలోని శైవ క్షేత్రాల్లో ఒకటైన ఝరాసంగం శ్రీ కేతకి సంగమేశ్వర స్వామి దేవాలయంలో శ్రావణమాసం పురస్కరించుకొని ఆదివారం ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎం ఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్ కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ రాజగో పురం వద్ద అర్చకులు పూర్ణ కుంభంతో వేద వాయిద్యాల మధ్య ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వారు స్వామివారికి పుష్కరిణిలో జల లింగాన్ని పూజలు నిర్వహించారు. తదనంతరం గర్భాలయంలోని శ్రీ పార్వతీ సమేత సంగమేశ్వర స్వామినీ దర్శించుకుని రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, నైవేద్యం, మహా మంగళారతి నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి శశిధర్ పూలమాల శాలువాలతో సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు.కేతకి ఆలయ చైర్మెన్ నీల వెంకటేశం, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు జగదీశ్వర్, పాలక మండలి సభ్యులు లక్ష్మయ్య, బీఆర్ఎస్ నాయకులు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.



ఆధ్యాత్మిక భావన అలవాటు చేసుకోవాలి

నవతెలంగాణ-జహీరాబాద్

ప్రతీ ఒక్కరూ ఆధ్యాత్మిక భావనను అలవాటు చేసుకోవాలని.. దీంతో అందరికీ శాంతియుత వాతావరణం దొరుకుతున్నదని డీసీఎంఎస్ చైర్మెన్ శివకుమార్ అన్నారు. జహీరాబాద్ తాలూకా వీరశైవ లింగాయత్ సమాజ్ ఆధ్వర్యంలో రాచన్న మందిర్ భక్త బృందం ఆదివారం నిర్వహించిన మహాపాద యాత్రను జెండా ఊపి ప్రారంభించారు. స్థానిక రాచన్న మందిరం నుండి ప్రారంభమైన ఈ యాత్ర రాంనగర్, షేఖాపూర్, పర్సపల్లి మీదుగా బడంపేట రాచన్న పుణ్య క్షేత్రానికి చేరుకుంది. స్థానిక ఇస్కాన్ భక్త బృందం బాధ్యులు డాక్టర్ వినోదకుమార్, రతన్ సారదా, రమేష్, రఘు, జానకిరామ్ లు కృష్ణ కీర్తనలు ఆలపించగా పాద యాత్ర ముందుకు సాగింది. ఈ కార్యక్రమంలో వీర శైవ లింగాయత్ బాధ్యులు శివరాజ్, అరుణ్, బండి శ్రీనివాస్, ఉదయ్, జిల్లా అధ్యక్షులు బాబు పటేల్, కార్యదర్శి జయప్రకాశ్, కాశినాథ్, సంతోష్, సిద్దేశ్వర్ సుల్గొంటి, సుభాష్, సుధా, కీర్తి, పెద్ద ఎత్తున మహిళలు భక్తి శ్రద్ధలతో భజనలు చేశారు.

పాదయాత్రకు మద్దతు ప్రకటించిన ప్రజాప్రతినిధులు..

రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు ఎర్రోళ్ల శ్రీనివాస్, మహమ్మద్ తన్వీర్, కోహిర్ జడ్పీటీసీ శ్రవంతి మార్గమధ్యలో కలిసి పాదయాత్రికులను అభినందించారు.



మండలంలో 2కే రన్..

నవతెలంగాణ-మునిపల్లి

మండలంలోని గొర్రెగట్టు చౌరస్తా నుంచి బుదేరా చౌరస్తా వరకు ఆదివారం 2 కే రన్ నిర్వహించారు. సంగారెడ్డి డీఎస్పీ రమేష్ జెండా ఊపి ఈ పరుగును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సౌత్ ఇండియా డిక్కి వైస్ ప్రెసిడెంట్ చంటి రాహుల్ కిరణ్, మునిపల్లి ఎస్ఐ చల్లా రాజశేఖర్, యువనాయకులు ఆనందరావు, లింగంపల్లి, సింగూర్, పుల్కల్ గురుకుల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



కేతకిని సందర్శించిన దర్యాపూర్ జడ్జి

నవతెలంగాణ-ఝరాసంగం

దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీ కేతకి సంగమేశ్వర దేవాలయాన్ని మహారాష్ట్రలోని అమరావతి జిల్లా దర్యాప్తు సివిల్ కోర్టు జడ్జి ఓం శంకర్ పాటిల్ ఆదివారం సందర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శాలువా పూలమాలతో సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులుగా డా.పూర్ణకృష్ణ

నవతెలంగాణ-జోగిపేట



కొండాపూర్ మండలంలోని సైదాపూర్ పాఠశాలలో తెలుగు భాషా ఉపాధ్యాయుడిగా సేవలందిస్తున్న అందోల్ మండలం సంగుపే గ్రామానికి చెందిన డాక్టర్. పూర్ణకృష్ణకు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం దక్కింది. రేపటి గురుపూజోత్సవం రోజున ఈ పురస్కారాన్ని ఆయన అందుకోనున్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సంపాదించి.. తెలుగు భాష ఔన్నత్యం కోసం, సాహిత్యం కోసం, విద్యార్థుల్లో విలువల యుతమైన సాహితీ పిపాసిని పెంపొందించే కార్యక్రమాల్లో పూర్ణకృష్ణ ఎప్పుడూ ముందుంటారు. ఇప్పటికే 21 ఏండ్ల ఉద్యోగ బాధ్యతలను పూర్తి చేశారు. వ్యాఖ్యాతగా, సాహితీవేత్తగా ఎన్నో అవార్డులు సొంతం చేసుకున్న భాషోపాధ్యాయులుగా జిల్లాలో అందరికీ సుపరిచితులుగా పేరు పొందారు.



అంగన్వాడీ టీచర్లను పర్మినెంట్ చేయాలి

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

అంగన్వాడి టీచర్లను, ఆయాలను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు చిరంజీవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు నారాయణఖేడ్ ఐసీడీఎస్ కార్యాలయంలో అంగన్వాడీ టీచర్లతో కలిసి సమ్మె నోటీస్‌ను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ.. అంగన్వాడీ టీచర్లను పర్మనెంట్ చేయాలని, ఈఎస్ఐ,పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.10 లక్షల ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. మంత్రి ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే.. సమ్మె చేయడానికి కూడా వెనకాడబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు నాగేశ్వరి, వీణకుమారి, శాంతాబాయి స్వరూప, అనురాధ, సత్య నిర్మల, లక్ష్మి, పుణ్యవతి, శ్యామల, పద్మ, అనిత, బాలమణి, యాదమ్మ, స్వరూప, తదితరులు పాల్గొన్నారు.

చిరుత సంచారం? భయాందోళనలో జనం

- ఇటీవలే ఆవును చంపితిన్న వన్యమృగాలు
- జంకుతున్న పశువుల, గొర్రెల కాపరులు
- పటిష్ట చర్యలు తీసుకోవాలని వేడుకోలు

నవతెలంగాణ-జిన్నారం

చిరుత సంచరిస్తుందనే అనుమానం మంగంపేట గ్రామస్తులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నది. అడవుల్లోకి పశువుల, మేకల, గొర్రెల కాపరులు వెళ్లాలంటే జడుసుకుంటున్నారు. ఇటీవల మంగంపేట అటవీ ప్రాంతంలో ఓ ఆవు భయంకరంగా మృత్యువాత పడడంతో.. ఆవును చిరుతే చంపి తినిందనే ఆందోళన వారికి ఎక్కువైంది. ఈ ఘటనను జిల్లా ఫారెస్ట్ అధికారుల దృష్టికి సైతం తీసుకెళ్లారు.

వన్యప్రాణులు దాడుల నుంచి రక్షించండి..

మంగపేట పరిసర గ్రామాలకు సంబంధించి వన్యప్రాణుల దాడుల నుంచి పశు సంపదను రక్షించాలని స్థానికులు, స్థానిక ప్రజాప్రతినిధులు కోరుతున్నారు. చిరుతపులి, ఎలుగుబంట్ల దాడిలోనే ఇటీవల ఆవు మృత్యువాత పడిందని ఆందోళనగా ఉన్నదన్నారు. అటవీ ప్రాంతాన్ని ఆనుకుని ఉండడంతో.. భయంకరమైన వన్యప్రాణులతో ఇబ్బంది ఎదురుకోవాల్సి వస్తుందంటూ ఆ గ్రామ సర్పంచ్ ప్రశాంతి



నరేందర్, ఉప సర్పంచ్ నక్క నాగరాజు, పలువురు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

నిఘా కట్టుదిట్టం చేయండి

మండల కేంద్రమైన జిన్నారం నుంచి మంగంపేట నియోజకవర్గ కేంద్రమైన నర్సాపూర్, జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణానికి ప్రతిరోజు వందలాదిమంది వివిధ పనుల నిమిత్తం వాహనాలు ఇతరత్రాలపై ప్రయాణిస్తూ ఉంటారు. కాగా మంగంపేట పరిసర అటవీ ప్రాంతంలో పులి తిరుగుతుందని అనుమానంతో వారు భయాందోళనలో రాకపోకలు సాగించాల్సి వస్తోంది. కాబట్టి వన్య ప్రాణులు దాడులు చేయకుండా ఈ ప్రాంతంలో ఫారెస్ట్ అధికారులు గట్టిగా నిఘా చర్యలను ప్రారంభించాలని కోరుతున్నారు.

బాధితుడికి ప్రభుత్వం సాయం చేయాలి

ఆవు మృత్యువాత పడిన బాధిత ఖాదర్ కుటుంబానికి పటాన్చెరు ఎమ్మెల్యే జీఎంఆర్, బీఆర్ఎస్ రాష్ట్ర నేత గూడెం మధుసూదన్ రెడ్డి, ఎమ్మెల్యే తనయుడు విక్రమ్ రెడ్డిలు రూ.25 వేల రూపాయల ఆర్థిక సాయాన్ని అందజేశారు. అయితే ప్రభుత్వం కూడా ఖాదర్ కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గతంలో కూడా చిరుత సంచారం

గతంలో కూడా జిన్నారం మండలంలోని గడ్డపోతారంకు సంబంధించిన ఓ పరిశ్రమలో చిరుత పులి సంచరించడం, ఫారెస్ట్ అధికారులు అనేక ప్రయత్నాలు చేసి పట్టుకోవడం లాంటి ఘటనలు చోటు చేసుకున్నాయి. ప్రధానంగా జిన్నారం, నర్సాపూర్ ప్రాంతాల్లో అడవులు విస్తరించడంతో.. ఈ ప్రాంతాల్లో భయంకరమైన వన్యప్రాణులు సంచరిస్తున్నాయని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కాగా ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టి.. క్రూర మృగాల నుంచి ప్రజలను కాపాడాలని కోరుతున్నారు.



కార్యకర్తను పరామర్శించిన దామోదర రాజానర్సింహా

నవతెలంగాణ-మునిపల్లి

మండలంలోని అంతారం కాంగ్రెస్ పార్టీ గ్రామాధ్యక్షుడు కొల్లూరి మైపాల్‌రెడ్డి తల్లి కంసమ్మరెడ్డి గత వారం రోజుల క్రితం మృతి చెందింది. కాగా మాజీ డిప్యూటీ సీఎం దామోదర రాజనర్సింహ ఆదివారం మైపాల్‌రెడ్డి స్వగృహానికి విచ్చేసి పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పిల్లోడి సతీష్ కుమార్, తాటిపల్లి రాంరెడ్డి, గోపులారం పాండు,పెద్ద చెల్మడా దుర్గ య్య, లింగంపల్లి మక్సుధ్ పటేల్ మరియు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మైపాల్‌రెడ్డి ఉన్నారు.

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట



- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- అమీన్‌పూర్‌లో రూ.1.20కోట్ల సొంత నిధులతో సీసీరోడ్ల నిర్మాణ పనులు

నవతెలంగాణ-అమీన్‌పూర్

అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని ప్రతీ కాలనీలో మౌలిక వసతుల కల్పనకు ప్రణాళిక బద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని మల్లికార్జునా హిల్స్, బ్యాంక్ కాలనీ, వంధనపురి కాలనీల్లో రూ.1.20కోట్ల సొంత నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అందించే నిధులతో పాటు జీవిఆర్ ఎంటర్ప్రైజెస్ సౌజన్యంతో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. సీఎం కేసీఆర్ ఇటీవల పటాన్చెరు బహిరంగ సభలో ప్రకటించిన రూ.25 కోట్లకు సంబంధించిన ప్రొసీ డింగ్స్ మంజూరు అయ్యాయన్నారు. అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ తుమ్మల పాండురంగారెడ్డి, వైస్ చైర్మెన్ నరసింహ గౌడ్, ఆయా వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఇక ప్రత్యక్ష రాజకీయాలకు దూరం



- ఆరోగ్యం సహకరించనందున నిర్ణయం
- ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాజీ మంత్రి డా.గీతారెడ్డి

నవతెలంగాణ-జహీరాబాద్

ఆరోగ్యం సహకరించకపోవడంతో ప్రత్యక్ష రాజకీయాల నుండి తప్పుకుంటున్నట్టు మాజీమంత్రి డాక్టర్.గీతారెడ్డి తెలిపారు. ఆరోగ్యం సహకరిస్తే పార్టీకి సేవలు అందిస్తానన్నారు. వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన నివాసంలో ఆదివారం జరిగిన జహీరాబాద్ నియోజకవర్గానికి చెందిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి అధ్యక్షత వహించి మాట్లాడారు. 14 ఏండ్లు జహీరాబాద్ నియోజ కవర్గానికి చెందిన నాయకులు, ప్రజలు రాజకీయంగా తనకు సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. జహీరా బాద్ నియోజకవర్గం నుంచి అక్కడికి వెళ్లిన కార్య కర్తలందరికీ ధన్యవాదాలు తెలిపారు. అనంతరం కార్యకర్తలు పూలమాల, శాలువాలతో ఆమెను ఘనంగా సన్మానిం చారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీపీ, గిరిధర్ రెడ్డి,శ్రీనివాస్ రెడ్డి, మాలికార్జున్‌రెడ్డి, నర్సింలు, తహెరా బేగం తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలి

నవతెలంగాణ-సదాశివపేట

కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వెంటనే విడనాడాలని సీపీఐ(ఎం) సదాశివపేట ఏరియా కార్యదర్శి వి.ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వ విధానాలతో నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయని, ఉద్యోగాల్లేక నిరుద్యోగులు ఎదురుచూపులు చూస్తున్నారని, మహిళల బతుకులు ఆగమైపోయాయని, కులమత ఘర్షణలు పెరుగుతున్నాయని ఆరోపించారు. సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా ఆదివారం సదాశివపేటలో నిరసన కార్యక్రమం చేపట్టి.. ప్రవీణ్ కుమార్ మాట్లాడారు. రోజు రోజుకు నిత్యవసర సరుకులు ధరలు అదుపు లేకుండా పెరుగుతున్నాయన్నారు. బియ్యం ధరలకు రెక్కలు వచ్చాయని.. పప్పు ధరలు కొండెక్కి, ప్రజలు గగ్గోలు పెడుతున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. దేశంలో కోట్లాదిమంది ప్రజలు పేదరికంలో మగ్గుతున్నారని.. అలాంటి వారిపైనే పన్నుల భారం పెంచి మరింత దారిద్ర్యంలోకి నెట్టుతున్నదని ఆరోపించారు. 2014లో ఉన్న ధరలకు, నేటి ధరలకు 50నుంచి



200శాతం వరకు ధరలు పెరిగాయన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానన్న కేంద్ర ప్రభుత్వం.. ఆవిషయాన్నే పట్టించుకోవడం లేదన్నారు. దేశంలో కులమత ఘర్షణలు లేపి ప్రజలను సమస్యలను పక్కదారి పట్టించడానికి ప్రయత్నం చేస్తున్నదని దుయ్యబట్టారు. ఇప్పటికైనా పేద ప్రజల సంక్షేమం కోసం పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నిరసనలో పార్టీ నాయకులు నర్సింలు, బొబ్బిలి రాజయ్య, ఖయ్యుం, దాసు, సోఫీ, సఫియా, బేగం, బిస్మిల్లా, అమీనా, ఫర్ జనా తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎస్‌డి మహాసభలను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-హత్నూర

ఆల్ ఇండియా సమతా సైనిక్‌దళ్(ఏఐఎస్ఎస్‌డి) 10వ మహాసభలు అక్టోబర్ 15న జరగనున్నాయని.. ఈ సభలను విజయవంతం చేయాలని ఆ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. గుండ్లమాచనూర్ అంబేద్కర్ భవనంలో ఆదివారం నిర్వహించన సమావేశంలో జాతీయ కమిటీ సభ్యులు సాయమొల చంద్రయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు సాయమొల్ల నర్సింగ్ రాజు మాట్లాడుతూ.. కుల మతాలకు అతీతంగా యువకుల్లో సామాజిక పరివర్తనను పెంపొందిస్తూ.. దేశ సమగ్రతను అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో అంబేద్కర్ స్వీయ దర్శకత్వంలో వ్యవస్థీకరించిన సంఘమే సమతా సైనిక్ దళ్ అని అన్నారు. అందుకే ప్రతీ ఒక్కరు ఈ సంఘంలో చేరడానికి ఆసక్తి చూపుతున్నారన్నారు. మతాల ముసుగులో తమ స్వార్థం కోసం కొందరు రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేయడానికి కుట్రలు పన్నుతుండటం శోచనీయమన్నారు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వ సాధనే ప్రధాన ధ్యేయంగా ఏఐఎస్ఎస్‌డి కృషి చేస్తున్నదన్నారు. ఈ మహాసభల విజయవంతానికి ప్రజలు మేధావులు, ఉద్యోగులు, మహిళలు, యువజన ప్రతి ఒక్కరూ తమ ఆర్థిక సహాయ సహకారాలను అందించాలని కోరారు. కార్య క్రమంలో రాష్ట్ర అధ్యక్షులు దాసరి లక్ష్మియ్య, ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి, ఆర్గనైజింగ్ సెక్రటరీ సెక్రెటరీ మేడి క్రిష్ణ, గ్రేటర్ అధ్యక్షులు మధులేటి, ఉపా అధ్యక్షులు మధు, బాలానగర్ కమిటీ అధ్యక్షులు గంగా రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ధీరత్వానికి ప్రతీక ఛత్రపతి శివాజీ

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- లక్డారంలో శివాజీ విగ్రహ నిర్మాణానికి భూమి పూజ.. ముస్లిం స్మశాన వాటిక ప్రహరీ నిర్మాణ పనులకు శంకుస్థాపన



నవతెలంగాణ-పటాన్‌చెరు

ధీరత్వానికి ప్రతీక ఛత్రపతి శివాజీ అని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు మండలం లక్డారం గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ మహారాజ్ భూమి పూజ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం గ్రామంలోని ముస్లింల స్మశాన వాటిక ప్రహరీ గోడ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సంద ర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. భావితరాలకు మహనీయుల చరిత్రను తెలియజేయాలన్న సమున్నత లక్ష్యంతో నియోజకవర్గ వ్యాప్తంగా విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. శివాజీ తన పరిపాలనలో లౌకికవాదానికి పెద్దపీట వేశారని గుర్తు చేశారు. శివాజీ అనుసరించిన పరిపాలన విధానాలు, వ్యక్తిత్వం నేటి తరానికి ఆదర్శప్రాయమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సువర్ణ మాణిక్‌రెడ్డి, ఎంపీటీసీ శైలజ, బీఆర్ఎస్ నాయకులు వెంకట్ రెడ్డి, గ్రామ పురపెద్దలు, ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాల ఏర్పాటు అభినందనీయం



నవతెలంగాణ-పటాన్‌చెరు

సామాజిక సేవలో భాగంగా ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని పటాన్‌చెరు లయన్స్ క్లబ్ ప్రతినిధులను పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అభినందించారు. పటాన్‌చెరు పట్టణంలోని లయన్స్ క్లబ్‌లో ఎమ్మెన్నార్ హాస్పిటల్ వైద్యులతో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ప్రతి ఒక్కరికి నాణ్యమైన వైద్యం అందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. ప్రతి ఒక్కరూ తమ వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ వహించడంతోపాటు, దురాలవాట్లకు దూరంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ విజయ్ కుమార్, మాజీ జెడ్పీటీసీ లయన్స్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు జైపాల్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మధుసూదన్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ పట్టణా ధ్యక్షులు అఫ్జల్, శీనయ్య, ఎమ్ఎన్ఆర్ డాక్టర్లు పట్టణ పెద్దలు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే





నవతెలంగాణ-జహీరాబాద్

విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని శ్రామిక విజ్ఞాన కేంద్రం కార్యదర్శి డాక్టర్ శివ బాబు అన్నారు. స్థానిక శ్రామిక విజ్ఞాన కేంద్రంలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులను ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులంటే కేవలం పాఠ్యపుస్తకాల్లోని అంశాల్ని బోధించడమే కాకుండా విద్యార్థులకు లోకజ్ఞానం, విచక్షణ, ధైర్యం, దయ, జాలి, మానవత్వం, సామాజికస్పృహ వంటి లక్షణాలను కూడా ప్రోత్సహించాలని సూచించారు. జహీరాబాద్ ప్రాంతంలోని విద్యార్థులకు చిత్తశుద్ధితో విద్యాబోధన చేస్తున్న ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. ఈ ప్రాంతంలోని పలు పాఠశాలల్లో పనిచేస్తున్న ఉత్తమ ఉపాధ్యాయులకు శ్రామిక్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో శాలువా, జ్ఞాపిక, పూలమొక్క, పుస్తకం మరియు సర్టిఫికెట్లతో సన్మానించారు. అనంతరం జహీరాబాద్ మరియు పరిసర మండలాల్లోని ప్రభుత్వ, ప్రయివేటు విద్యాలయాలకు చెందిన ఉపాధ్యాయులు జ్యోతిర్మయి, కె.యస్. జమీల్, ఎ.చంద్రశేఖర్, ఎం.రాబర్ట్ లింకన్, ఎం. రామ చంద్రయ్య, కులకర్ణి నాగేశ్వరరావు, జోయల్ ఇమాన్యుయేల్, యస్.విజ యలక్ష్మి, ఆర్.నారాయణరెడ్డి, షాహిన్ ఉన్నిసా, కర్ణం తులసి, ఎం.సువర్ణ, రంగా రమాదేవి, కోస్గిలక్ష్మి, షేక్ కాలేషా వలి, సయ్యద్ రవూఫ్, కిషోర్ బాబు, యం.డి యూసుఫ్, గౌతమ్ కుమార్, కృష్ణవంశీ, క్రాంతి కుమార్, సంజీవ్ కుమార్, జహీర్ రాజా,వి.గౌతమ్, ఎం.వెంకటయ్య, సరోజన, ఎస్తేర్ రాణి తదితరులను శ్రామిక్ విజ్ఞానకేంద్రం ప్రతినిధులు సన్మానించారు. సభకు శ్రామిక్ విజ్ఞాన కేంద్రం ట్రస్టీ డా.విజయలక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో శ్రామిక్ విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ ట్రస్టీ బి.రాంచందర్, ట్రెజరర్ యస్. మహిపాల్, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు వెంకటేశం, అశోక్ సిరిసి, పూలమ్మ,శ్వేత, నర్సింలు, శ్రీనివాస్, వేణు తదితరులు పాల్గొన్నారు.

బీఈడీ, డీఈడీ అభ్యర్థులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలి



నవతెలంగాణ-సంగారెడ్డి

బీఈడీ, డీఈడీ అభ్యర్థులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు సురేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక టీపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షులు సందీప్ అధ్యక్షతన జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ.. అసెంబ్లీలో సీఎం కేసీఆర్ ఇచ్చిన మాట ప్రకారం 13,086 టీచర్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలిపిన బీఈడీ అభ్యర్థులను పోలీసులు లాఠీలతో కొట్టి.. అక్రమంగా కేసులు పెట్టారని ఆరోపించారు. స్వయాన సీఎం కేసీఆర్ అసెంబ్లీలో ఇచ్చిన హామీని కూడా నిలబెట్టుకోరా? అని ప్రశ్నించారు. కొలువుల కోసం తెలంగాణ తెచ్చుకున్న నిరుద్యోగులను కొట్టే హక్కు కేసీఆర్‌కి ఎక్కడదని, ఇచ్చిన మాట నిలబెట్టుకోకుండా నిరుద్యోగుల రక్తాన్ని కండ్ల చూస్తారా అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా సహాయ కార్యదర్శి గంజి హర్షిత్, జిల్లా కోశాధికారి శ్రీకాంత్, జిల్లా నాయకులు నవీన, ప్రియా, అర్చన తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
మెదక్
సోమవారం | 04 సెప్టెంబర్ 2023 | www.navatelangana.com

బాధిత కుటుంబానికి జెడ్పీటీసీ ఆర్థిక సాయం

నవతెలంగాణ-నర్సాపూర్



శివ్వంపేట మండల కేంద్రానికి చెందిన ముయ్యడి రాములు శనివారం ఆకస్మికంగా మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా ఆర్థిక ప్రణాళిక సంఘ సభ్యులు, శివ్వంపేట జడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్త ఆదివారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల నగదు, నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేశారు. అదేవిధంగా శివంపేట్ సర్పంచ్ పత్రాల శ్రీనివాస్ గౌడ్ కూడా బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.3 వేల ఆర్థిక సాయం అందించారు. జడ్పీటీసి పబ్బ మహేష్ గుప్త మాట్లాడుతూ.. బాధిత కుటుంబాలకు ఎల్లవేళలా అండగా ఉంటామన్నారు. ఆయనతోపాటు శివంపేట్ ఉపసర్పంచ్ పద్మవెంకటేష్, గ్రామ కమిటీ అధ్యక్షుడు ముద్దగాళ్ల లక్ష్మీనర్సయ్య,వార్డు సభ్యులు ముయ్యడి సింహం, వంజరి కొండల్, కోవూరి వెంకటేష్, బీఆర్ఎస్ నాయకులు చిన్న అంజనేయులు బొట్టు బిక్షపతి, చుక్క బిక్షపతి తదితరులు పాల్గొన్నారు

మండలంలో పలువురికి ఎమ్మెల్యే పరామర్శ

నవతెలంగాణ-నార్సింగి



దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు మండల కేంద్రంలో ఆదివారం పర్యటించి పలువురిని పరామర్శించారు. మండల కేంద్రం లో ఓటరు నమోదు బూత్‌లను సందర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బీజేపీ మండలాధ్యక్షుడు గుర్రాల మహంకాలి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. మహంకాలీ కుటుంబానికి అన్ని విధాలుగా ఆదుకుంటానని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ నాయకుడు మాజీ వైస్ ఎంపిపి ఆకుల మల్లేశం గౌడ్ తండ్రి మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ప్రగాఢ సహానుభూతి తెలిపి పరామర్శించారు. బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు విష్ణు వర్ధన్ రెడ్డి అపెండిక్స్ తో బాధ పడుతూ శస్త్ర చికిత్స చేయించుకున్న విషయం తెలు సుకుని అతని ఇంటికి వెళ్లి పరామర్శించి, ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు సత్య పాల్ రెడ్డి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మ సొమ్ముకు అభయమేది..

- వివాదాల్లో నిలుస్తున్న ఏడుపాయల
- రచ్చకెక్కిన బంగారం, వెండి తరలింపు
- ఆలయ ప్రతిష్ట దెబ్బతినేలా ఈఓ, ఛైర్మెన్ వైఖరి

నవతెలంగాణ-మెదక్

> చారిత్రాత్మక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక వైభవాలకు నెలవైన ఏడుపాయల వనదుర్గ మాతా దేవస్థానం ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతుంది. అంతటి ప్రాశస్త్యం కలిగిన ఆలయం పలు అంశాలపై వివాదాల్లో నిలుస్తుం డటం కలవరపెట్టే అంశంగా మారింది. ఆలయ చైర్మెన్, ఈఓల మధ్య తారాస్థాయికి చేరిన విభేధాలు ఆలయ ప్రతిష్ఠను దెబ్బతీసే విధంగా ఉన్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదే క్రమంలో దేవస్థానం పరిధిలో జరుగుతున్న పరిణామాలు పలు పార్టీలకు రాజకీయ అస్త్రాలకు వేదికగా మారుతున్నాయనే వాదనలు వినిపిస్తున్నాయి.



మెదక్ జిల్లా పాపన్నపేట మండలం నాగ్సాన్ పల్లి శివారులో ఏడుపాయల వన దుర్గామాత కొలువుదీరింది. తెలంగాణ, ఆంధ్రాతో పాటు, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో భక్తులు ఆలయ సందర్శనకు వచ్చి వనదుర్గా మత అమ్మవారికి మొక్కులు తీర్చుకుంటారు. భక్తుల కానుకలు, ముడుపుల రూపంలో చెల్లించే నగదు, బంగారం, వెండి ఆభరణాలతో పాటు వాహన, దర్శనం టిక్కెట్లు, అద్దెలు తదితర అంశాలకు సంబంధించి ప్రతి ఏటా ఆలయానికి సుమారు రూ. 6 కోట్లకు పైగా ఆదాయం సమకూరుతుంది. అంతటి ప్రాశస్త్యం కలిగిన ఆలయ ప్రతిష్ట ఆలయ ఈఓ, ఛైర్మెన్‌ల వైఖరి వలన అప్రతిష్టపాలవుతుందని పలువురు విమర్శిస్తున్నారు.

ఛైర్మెన్, ఈఓల మధ్య విభేదాలు..

ఏడుపాయల ఆలయ కమిటీలో ప్రస్తుతం ఉన్న పాలకవర్గానికి వరుసగా రెండో సారి అవకాశం కల్పించారు. 14 మందితో పాలకవర్గం ఏర్పాటు అవగా ఛైర్మెన్‌గా బాలా గౌడ్ వ్యవహరిస్తున్నారు. అయితే ఆలయ కార్యనిర్వాహక అధికారి(ఈఓ)గా ఉన్న శ్రీనివాస్‌కు ఛైర్మెన్‌కు మధ్య కొంత కాలంగా ఆలయ నిర్వహణ, వ్యక్తిగత ప్రాముఖ్యత, ఏర్పాట్ల వంటి విషయాల్లో విభేదాలున్నాయి. ఈ ఏడాది జరిగిన జాతరలో ఏర్పాట్ల పర్యవేక్షణ సమయంలో ఆ విబేధాలు మరింత ముదిరినట్లు తెలుస్తుంది. అత్యంత ప్రాముఖ్యత కలిగిన జాతరలో ఈఓ పాలకమండలి సభ్యులు, సిబ్బందికి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా వొంటెద్దు పోకడలకు పోవడం పలు విమర్శలకు తావిచ్చినట్లు చర్చించుకుంటున్నారు. తాజాగా అమ్మవారి కానులుగా వచ్చిన బంగారం, వెండి ని మింట్ లోని ప్రభుత్వ కార్యాలయంలో కరిగించిన 1.930 కిలోల బంగారం, 72.513 కిలోల వెండిని తన కారులో మెదక్ తీసుకొచ్చిన ఈఓ బ్యాంక్ సమయం దాటిపోవడంతో ఇంటికి తీసుకెళ్ళాడు. ఈ క్రమంలో జరిగిన పరిణామాలతో ఈఓ, ఛైర్మెన్ మధ్య విభేదం స్పష్టమైంది. ఇద్దరి మధ్య నెలకొన్న విభేదాల కారణంగా అలయ అభివృద్ధి పై ప్రభావం పడే అవకాశాలు ఉన్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఈఓ ఆధిపత్యం పోరు..

ఏడుపాయల ఈఓ ఆలయ అభివృద్ధి పక్కనపెట్టి రాజకీయ అండదండలతో ఆధిపత్య పోరులో పోటీ పడుతున్నారనే అపకీర్తిని మూటకట్టుకుంటున్నారు. ఏడుపాయల ఇంఛార్జి ఈఓగా సార శ్రీనివాస్ విధుల్లో చేరినప్పటి నుంచి వొంటెద్దు పోకడపోతున్నట్లు విమర్శలున్నాయి. జోనల్ వ్యవస్థ ప్రక్రియలో భాగంగా గతేడాది యాదద్రి జిల్లా నుంచి ఏడుపాయల రెగ్యులర్ ఈఓ గా రవికుమార్ బదిలీ పై వచ్చారు. దీంతో శ్రీనివాస్ ను శివ్వంపేట మండలం చాకరిమెట్ల హనుమాన్ దేవాలయానికి బదిలీ చేశారు. అయినా కుర్చీ మీద వ్యామోహంతో అక్కడ నుంచి కదల లేదనే ఆరోప ణలు ఉన్నాయి. ఇద్దరు ఈఓ లు ఉండటంతో ఆలయ సిబ్బంది ఇబ్బందులు పడాల్సి వచ్చింది. అయితే ఏడుపాయలలో చక్రం తిప్పడానికి అలవాటుపడిన శ్రీనివాస్ రాజకీయ అండదండలతో తిరిగి ఏడుపాయల ఈఓ గా బాధ్యతలు చేపట్టడం జరిగింది. అక్కడున్న గ్రేడ్1 అధికారి అయిన రవి కుమార్ ను సిద్దిపేటకు బదిలీ చేశారు. ఆ తరువాత ఏర్పడిన పాలకమండలి సభ్యులతో సఖ్యతగా ఉండకపోవడమే కాకుండా ఛైర్మెన్ దృష్టిలో ఉంచకుండా ఇష్టారీతిన ఆలయ నిర్వహణ పనులు చేపడుతుండటంతో మరోసారి ఆలయ సిబ్బంది ఇబ్బందులు తప్పలేవు. అయితే తాజా పరిణామాలతో ఈఓ ను బదిలీ చేయాలని పాలకమండలి సభ్యులు తీర్మానం చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా ఆలయ కమిటీ, అధికారులు, సిబ్బంది ఆలయ అభివృద్ధికి పాటుపడాలని పలువురు కోరుతున్నారు.

అమ్మ సొమ్ముకు భద్రత ఏది?

భక్తులు అమ్మవారికి ముడుపుగా సమర్పించే కానుకలకు భద్రత కరువైంది. భక్తులు అమ్మవారికిచ్చె నగదు, బంగారం, వెండిపై ఇంటి దొంగల కన్ను పడిందనే ఆరోపణలున్నాయి.

- 2020లో గర్భగుడి కడప వెండి తొడుగు చోరీకి గురైంది.
- 2022లో గర్భగుడిలోని హుండీని పగలగొట్టి నగదు, బంగారు, వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు.
- ఇదే ఏడాదిలో ఆలయ హుండీ లెక్కుపులో ఓ సిబ్బంది చేతివాటం ప్రదర్శించి రూ.50వేలు అపహరించాడు. ఇలాంటి ఘటనలు చాలా ఉన్నాయనే ఆరోపణలు ఉన్నాయి.
- తాజాగా రూ.3 కోట్ల విలువైన ఆలయ బంగారం, వెండిని నిబంధనలకు విరుద్ధంగా ఈవో మింట్ కార్యాలయం నుంచి తన ఇంటికి తీసుకెళ్లడం వివాదస్పదమైంది.

నస్కల్ మున్నూరు కాపు సంఘానికి రూ.5 లక్షలు

నవతెలంగాణ-నిజాంపేట



మండల పరిధిలోని నస్కల్ గ్రామ మున్నూరు కాపు సంఘానికి 5 లక్షల ప్రొసీడింగ్ కాపీని మెదక్ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి ఆదివారం ఆమె స్వగృహంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని కుల సంఘాలకు కమ్యూనిటీ హాళ్ల మంజూరు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దేశెట్టి సిద్ధ రాములు, నిజాంపేట మాజీ పిఎసిఎస్ చైర్మన్ పప్పుల కిష్టారెడ్డి, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పరిపాట సుధాకర్ రెడ్డి, నస్కల్ గ్రామ కమిటీ అధ్యక్షుడు దుర్గయ్య, బీఆర్ ఎస్ నాయకులు రాజు, ఎల్లం, నియోజకవర్గ ఇన్చార్జి రంజిత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌లను పరిశీలించిన ఆర్డీవో



నవతెలంగాణ/తూప్రాన్‌రూరల్ (మనోహరాబాద్)

తూప్రాన్ మున్సిపల్ కేంద్రంలోని 6, 7, 10, 11, 12 పోలింగ్ బూత్‌లను తూప్రాన్ ఆర్డీవో జయ చంద్రారెడ్డి ఆదివారం పరిశీలించారు. అలాగే 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. బూత్ లెవెల్ అధికారులు ఓటరు నమోదు చేయించాలని.. నూతనంగా ఎవరైనా 18 సంవత్సరాలు నిండిన వారు వస్తే వారి నుండి ఫాం 6 ద్వార నమోదు చేయిం చాలని సూచించారు. అలాగే పేరు మార్పులు కానీ ఓటరు లిస్టులో ఏమైనా తప్పులు ఉంటే వారి నుండి ఫాం 8 ద్వార కరెక్షన్ చేయాలని తెలిపారు. ఎవరైనా మృతి చెందిన వారుంటే వారి కుటుంబ సభ్యుల నుండి ఫాం 7ను తీసుకో వాలని ఆర్డీవో సూచించారు. అలాగే 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆర్డీవో జయచంద్రారెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ ఆర్ఐ నాగరాజుతో పాటు బూత్‌లెవెల్ అధికారులు పాల్గొన్నారు.

ఓటర్ నమోదు కేంద్రాన్ని సందర్శించిన ఆర్డీవో

నవతెలంగాణ-నిజాంపేట



మండల పరిధిలోని నందిగామ గ్రామంలో ఆదివారం ఓటర్ నమోదు కేంద్రాలని ఆర్డిఓ అంబాదాస్ రాజేశ్వర్ రావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎలక్షన్ కమిషనర్ ఆదేశాల మేరకు రెండో విడత ఓటు హక్కు నమోదు కార్యక్రమం నిర్వహించా మన్నారు. స్పెషల్ క్యాంపు గా 2,3,న ఓటు హక్కును నమోదు ప్రక్రియ చేపట్టామన్నారు. ఈ అవకాశాన్ని 18 సంవత్సరాల నుండి ఉన్న ప్రతి ఒక్కరూ సద్వినియం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ, గంగాధర్ గౌడ్, గ్రామ కార్యదర్శి అరిఫ్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ మండలాధ్యక్షుడి ఒంటెద్దు పోకడ?

నవతెలంగాణ-కొల్చారం

అధికార పార్టీ మండలాధ్యక్షుడు ఒంటెద్దు పోకడపై మండల కార్యకర్తలు నారాజ్‌లో ఉన్నట్టు గుసగుసలు వినబడుతున్నాయి. రాజకీయ పరిణామాలపై బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాంపల్లి గౌరీశంకర్ గుప్త మండల కేంద్రంలోని జైన దేవాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. అయితే ఈ సమావేశానికి ముఖ్య నాయకులతోపాటు మరికొందరి విలేకరులకు సమాచారం ఇవ్వలేదని.. ఆయన ఒంటెద్దు పోకడకు ఇది నిదర్శనమంటూ సొంత పార్టీ నాయకులే విమర్శిస్తున్నారు. అంతేకాకుండా మండలంలో జరిగే అధికారిక కార్యాక మాలకు సైతం సమాచారం ఇవ్వడం లేదని దీంతో పార్టీ కార్యకర్తలు, నాయకులు నారాజ్ చెందుతున్నట్టు సమాచారం. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పార్టీలో సమన్వయం పాటించకపోవడం పార్టీకి తీవ్ర నష్టం వాటిల్లిక తప్పదని కొందరు హెచ్చరిస్తున్నారు.

తమిళనాడు మంత్రి ఉదయ్ స్టాలిన్ పై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-పెద్దశంకరంపేట్

హిందూ మతాన్ని కించపరిచేలా తమిళనాడు మంత్రి ఉదయ్ నిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలపై ప్రభుత్వం చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని పెద్ద శంకరంపేట బీజేపీ మండలాధ్యక్షుడు కోనం విట్టల్ డిమాండ్ చేశారు. హిందూ సనాతన ధర్మాన్ని.. దోమల్ని, డెంగ్యూ, మలేరియా లాగా తుడిచిపెట్టాలని పేర్కొన్న ఉదయ్ స్టాలిన్‌ను వెంటనే శిక్షించాలన్నారు. ప్రపంచంలో భారతదేశాన్ని విశ్వ గురువుగా నిలపెట్టే నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని ప్రజలు కోరుకోవాలని ఆయన అన్నారు. క్రైస్తవ మతం ముస్లిం మతం రాకముందే హిందూ సనాతన ధర్మం ఉందని ఈ సనాతన ధర్మం శాశ్వతమైందన్నారు. ఉదయ్ స్టాలిన్ చేసిన వ్యాఖ్యలను భారతదేశంలోని ప్రజలు మొత్తం ఖండిస్తున్నారన్నారు. వెంటనే తమిళ నాడు మంత్రి ఉదయ్ స్టాలిన్ పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ నాయకులు శ్రావణ్ కుమార్, దమ్ము సాయిలు, మంగలి కృష్ణ, సురేష్, బుగుడాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులు తాళలేక వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-నర్సాపూర్

ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఒక వ్యక్తి చెరువులో పడి ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన సంఘటన ఆదివారం నర్సాపూర్ మున్సిపల్ పరిధిలోని తుకారం తండాలో చోటు చేసుకుంది . ఈ సంఘటన వివరాలు కుటుంబీ కుల కథనం ప్రకారం ఇలా ఉన్నాయి..నర్సాపూర్ మున్సిపల్ పరిధిలోని తుకారాం తండాకు చెందిన కాట్రోత్ మోహన్ 31 తుకారాం తండాలో ఇంటి వద్దనే ఉంటూ వ్యవసాయ పనులు చేసుకుంటున్నాడు జీవనం సాగించేవాడు , ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదానికి గురికాగా ఏ పనులు చేయలేక ఆపైన ఆర్థిక ఇబ్బందులు ఎదురు కావడంతో మనస్తాపం చెంది శనివారం రాత్రి నర్సాపూర్ రాయరావు చెరువులోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం ఉదయం రాయరావు చెరువులో గాలించగా కాట్రోత్ మోహన్ మృతదేహం లభ్యమైంది. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు..



గ్రామ పరిశుభ్రతే లక్ష్యంగా యువత స్వచ్ఛబారత్

నవతెలంగాణ/తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

మనోహరాబాద్ మండ లంలోని కూచారం గ్రామ ంలో నేచర్ ఐకాన్ యూత్ సభ్యులు గత 281 వారా లుగా స్వచ్ఛభారత్ కార్యక్ర మాలను చేపడుతూ మండల ంలోనే ఆదర్శంగా నిలు స్తున్నారు. ఆదివారం గ్రామం లోని ఒకటవ వార్డులో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని చేపట్టారు. వర్షా కారణంగా పెరిగిన పిచ్చి మొక్కలను గడ్డిని తొలగించి శుభ్రం చేవారు. అలాగే ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి శుభ్రం చేసి వ్యర్థాలను డంప్‌యార్డుకు తరలించారు. గ్రామంలో నేచర్ ఐకాన్ యూత్ చేపడుతున్న స్వచ్ఛభార్ కార్యక్రమాలలో చిన్నారులు సైతం పాల్గొని అందిరికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ కార్యక్రమంలో నేచర్ ఐకాన్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్‌ను నిరోధించాలి

- మనిషి మనుగడకు ప్లాస్టిక్ హానికరం
- మూడు నెలల్లో మట్టిలో కలిసిపోయే కవర్లు రావడం అభినందనీయం
- రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి అల్లోల్ల ఇంద్రకరణ్‌రెడ్డి

నవతెలంగాణ/తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)



పర్యావరణానికి హానికలిగించే ప్లాస్టిక్ కవర్లను నిరోధించాలని.. కేవలం మూడు నెల్లో మట్టిలో కలిసిపోయే విదంగా ప్లాస్టిక్ రహిత బ్యాగులను అత్యాధునిక పద్ధతిలో కవర్లను తయారు చేయడం అభినందనీయమని ఇలాంటి కవర్లను వాడే విదంగా ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర దేవాదాయ, అటవీ మరియు పర్యావరణ శాఖ మంత్రి అల్లోల్ల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. మనోహరాబాద్ మండలంలోని కొండాపూర్ గ్రామ శివారులోగల పారిశ్రామిక వాడలో నూతనంగా ఏర్పాటు చేసిన ఏఐసిఎంటీ బయో ప్రొడక్ట్స్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమను రాజ్యసభ సభ్యులు ఎంపీ బడుగుల లింగమయ్య యాదవ్‌తో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్లాస్టిక్ కవర్లను వాడకంతో వాటిని ఎక్కడ పడితె అక్కడ పడేయడంతో కవర్లు భూమిలో కరిగిపోకుండా వందల సంవత్సరాలు అలాగే ఉంటాయన్నారు. దాంతో ఆ భూమిలో కనీసం గడ్డికూడా మొలవని పరిస్థితి ఉంటుందని దాంతో పర్యావరణానికి విఘాతం ఏర్పడుతుందన్నారు. ప్లాస్టిక్ కవర్లు మనిషి మనుగడకు ఎంతో ప్రమాదమని రానున్న భవిష్యత్ తరాలకు హానీ కలిగించే ప్లాస్టిక్ కవర్లను వాడకుండా ప్రతి ఒక్కరు అవగాహనతో ఉండాలని సూచించారు. ప్లాస్టిక్ క్యాన్సర్‌కు కారకంగా ఉంటుందన్నారు. కాబట్టి ఎవరూ కూడా ప్లాస్టిక్ వాడొద్దన్నారు. అలాగే సీఎం కేసీఆర్ పర్యావరణ పరిరక్షణ కోసం హరితహారంలో భాగంగా తొమ్మిదేండ్లలో 2.72 కోట్ల మొక్కలను నాటారన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిరోధి ంచేందుకు ప్రభుత్వాలు ఎంతచేసినా ప్రజలలో మార్పు రావాలని సూచించారు. రానున్న గణపతి పండగకు ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహం కాకుండా పర్యావరణానికి హానికలిగించని మట్టి వినాయకులనే ఏర్పాటు చేసి పూజలు చేయాలని సూచించారు. ప్లాస్టిక్ వాడకంపై ప్రలజకు అవగాహన కలింగించేలా ఓ అంబాసిడర్‌లాగా చెప్పాలని సినీ నటుడు ఆలీని కోరారు. ఈ కార్యక్రమంలో సినీనటుడు ఆలీ, పరిశ్రమ యజమాని మౌలాలి, గ్రామ సర్పంచ్ చింతల మమత రవిముదిరాజ్, డీఆర్‌డీవో సైంటిస్ట్ వీరభ్రహ్మం,తో పాటు పరిశ్రమ ప్రతినిధులు జాని తదితరులు పాల్గొన్నారు.

పటాన్‌చెరు ఎమ్మెల్యే సీటుపై పునరాలోచించాలి

నవతెలంగాణ-కౌడిపల్లి



పటాన్‌చెరు ఎమ్మెల్యే సీటుపై ప్రభుత్వం పునరాలోచించి.. సీటు కేటాయించాలని చిట్కుల్ సర్పంచ్, బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకుడు నీలం మధు అన్నారు. ముదిరాజ్ జాతికి అన్యాయం చేయకుండా న్యాయం చేయాలని.. అప్పుడే గెలుపు సాధ్యమవుతుందన్నారు. కౌడిపల్లి మండలం వెంకట్రావుపేట నుంచి కౌడిపల్లి వరకు 200 బైకులతో ముదిరాజులు ర్యాలీగా వచ్చి గజమాలతో ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ.. రాష్ట్రంలో నాలుగు ఎమ్మెల్యే స్థానాలను ముదిరాజులకు కేటాయించాలన్నారు. రాష్ట్రంలో ముదిరాజుల సంఖ్య ఎక్కువగా ఉన్నదని.. ఎమ్మెల్యే స్థానాలు కూడా ఇస్తే అన్ని స్థానాల్లో భారీ మెజారిటీతో గెలవడం సాధ్యమవుతుందన్నారు. ముదిరాజులకు గౌరవం ఇవ్వాలన్నారు. ముదిరాజులకు ఎక్కడ కూడా ఎమ్మెల్యే టికెట్ ఇవ్వకపోవడం ముదిరాజుల్లో ముకింత నిరాశ చేకూరిందన్నారు. రాబోయే ఎన్నికల్లో ముదిరాజుల ఎన్నికలే కీలకమవుతాయన్నారు. ముదిరాజ్ జాతి కోసం ఏదైనా చేయటానికి సిద్ధంగా ఉన్నానని, ఎక్కడికెళ్లినా ముదిరాజులు అండగా ఉండటం సంతోషం అన్నారు. దీనిపై అధిష్టానం పునరాలోచన చేసుకున్నప్పుడే పటాన్ చెరు ఎమ్మెల్యే స్థానం సాధ్యమవుతుందన్నారు. నీలం మధు రాకతో ముదిరాజులు ఆడపడుచులు భారీ సంఖ్యలో తరలివచ్చి నీలమడుగు పూలతో స్వాగతం పలికారు. అనంతరం సదాశివ పల్లిలో ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టలు పాల్గొని పూజలు చేశారు. అనంతరం రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్పర్సన్ సునీతారెడ్డి, సదాశిపల్లి సర్పంచ్ శోభ నర్సింగ్‌రావు, వీరయ్య, ఎంపిటిసిల పురం మండలాధ్యక్షులు ప్రవీణ్ కుమార్, నాగ్‌సన్‌పల్లి సర్పంచ్ ఎల్లం విగ్రహ ప్రతిష్టలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

18 ఏండ్లు నిండితే ఓటర్‌గా నమోదు చేయించుకోవాలి



నవతెలంగాణ-వెల్దుర్తి

18 ఏండ్లు నిండిన ప్రతీ ఒక్కరు ఓటర్ జాబితాలో పేరు నమోదు చేయించుకోవాలని నర్సాపూర్ ఆర్డీవో శ్రీనివాస్ సూచించారు. వెల్దుర్తి మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో బూత్ లెవెల్ అధికారుల ఓటర్ జాబితా సవరణ కార్యక్రమాన్ని ఆర్డీవో శ్రీనివాస్, స్థానిక తహసీల్దార్ తులసిరామ్‌లు ఆదివారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. నర్సాపూర్ నియోజకవర్గంలో 305 ఓటర్ నమోదు కేంద్రాలు ఉన్నాయన్నారు. నెల్లూరు హస్తాల్పూర్ వెల్దుర్తిలో ఓటర్ నమోదు కేంద్రాలను పరిశీలించినట్టు చెప్పారు. పెండ్లి అయి ఇతర ప్రాంతాలకు వెళ్లినా, పెండ్లి చేసుకుని ఇక్కడకి వచ్చినా తన భర్త ఆధార్ కార్డుతో పాటు మ్యారేజ్ సర్టిఫికెట్ జతచేసి ఓటర్ జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. బీఎల్‌వోలు ప్రతీ ఇంటికి వెళ్లి ఓటర్ జాబితా సవరణ చేసి ఈనెల 19 వరకు సంబంధిత అధికారులకు అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ జయభారత్ రెడ్డి, బీఎల్వోలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సొంత నిధులతో ఆలయాల నిర్మాణం



- సేవాలాల్ మహారాజ్, భవాని మాత దేవాలయాల నిర్మాణాలకు భూమి పూజ

నవతెలంగాణ-అమీన్‌పూర్

పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని గిరిజన తాండాల్లో బంజారాల ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ మరియు భవాని మాత దేవాలయాలను పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తన సొంత నిధులతో నిర్మిస్తున్నారు. ఈ మేరకు అమీన్పూర్ మున్సిపల్ పరిధిలో గోశాల ఎదురుగా నిర్మించ తలపెట్టిన సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్, భవాని మాత దేవాలయాల నిర్మాణ పనులకు స్థానిక ప్రజాప్రతినిధులు, బంజారాల ప్రతినిధులతో కలిసి ఆదివారం భూమి పూజ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. పటాన్చెరు నియోజకవర్గం పరిధిలో పరమత సహనానికి పెద్ద పీట వేస్తూ అన్ని మతాల దేవాలయాలు, మసీదులు, చర్చిల నిర్మాణానికి తన వంతు సహకారం అందిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ మున్సిపల్ చైర్మెన్ తుమ్మల పాండురంగారెడ్డి, వైస్ చైర్మెన్ నంసింహ గౌడ్, తెలంగాణ బంజారా ఎంప్లాయిస్ సేవా సంఘం అధ్యక్షుడు రాథోడ్, గౌరవ అధ్యక్షుడు మోహన్ సింగ్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, బంజారా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రకాష్ రాథోడ్ వ్యాఖ్యలను ఖండిస్తున్నాం

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు ప్రకాష్ రాథోడ్ స్థానిక ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డిపై, అలాగే ఇక్కడి అభివృద్ధిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్టు బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సంజీవ్ పాటిల్, గ్రామాధ్యక్షుడు యాదవరావు పాటిల్, జమ్లా తాండ సర్పంచ్ దివ్యభారతి చరణ్ మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు నారాయణ నాయక్, మండల సోషల్ మీడియా అధ్యక్షుడు రమేష్‌లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి సహకారంతోనే సింగర్ బొగుడ తాండాకి రెండు కోట్లతో బ్రిడ్జివేసి దానికి గైడ్ వాల్స్ వేయించారన్నారు. తాండాలో మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి నల్ల ద్వారా నీరు అందించడం జరిగిందని.. ఇలాంటి ఎన్నో అభివృద్ధి పథకాలను ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో చేపట్టారన్నారు. అలాంటి ఎమ్మెల్యేపై ఇష్టారీతిన నిందలు వేయడం సరికా దని హెచ్చరించారు. కార్యక్రమంలో తాండా వాసులు, బీఆర్ఎస్ కార్యకర్తలు నాయకులు పండరి నాయక్, వాల్లే నాయక్, మారుతి, చందర్, గంగారాం, వరశింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఈవో శ్రీనివాస్ ఇంట్లోనే తునికి నల్ల పోచమ్మ ఆలయ బంగారం

- ఐదు తులాల బంగారం, కిలో వెండి మూడేండ్లుగా ఆయన దగ్గరే

నవతెలంగాణ-కౌడిపల్లి



మండలంలోని తునికి నల్ల పోచమ్మ ఆలయానికి సంబంధించిన బంగారం, వెండి అప్పటి ఆలయ ఈవో సారా శ్రీనివాస్ దగ్గరనే ఇప్పటికీ ఉన్నట్టు దేవాలయ శాఖ అధికారులు తెలిపారు. ఏడుపాయల దుర్గ భవాని ఆలయానికి సంబంధించిన బంగారం, వెండిని ఆలయ ఈవో శ్రీనివాస్ తన ఇంట్లో పెట్టుకోవడం ప్రస్తుతం చర్చనీయాంశం అయింది. అయితే గతంలో తునికి నల్ల పోచమ్మ ఈవోగా శ్రీనివాస్ విధులు నిర్వహించినప్పుడు కూడా ఐదు తులాల బంగారి నెక్లెస్, కిలో వెండి తాంబూలంను ఆయన దగ్గరే పెట్టుకున్నారు. మూడేండ్ల క్రితం బదిలీపై ఏడుపాయల వెళ్ళగా ఆయన స్థానంలో మోహన్ రెడ్డి తునికి నల్ల పోచమ్మ ఈవోగా బాధ్యతలు తీసుకున్నారు. బాధ్యతలు తీసుకునేటప్పుడే చార్జ్ షీట్‌లో ఆలయానికి సంబంధించిన బంగారం, వెండి ఈవోకు అప్పగించాల్సి ఉన్నప్పటికీ.. మూడేండ్లు దాటుతున్నా నేటికీ ఇవ్వలేదని ఆలయ అధికారులు తెలిపారు. ఈ విషయమై దేవాదాయ కమిషనర్ కు గత మూడు నెలల క్రితం ఫిర్యాదు కూడా చేశామని ఈవో మోహన్‌రెడ్డి చెప్పారు. ఇలాంటి అధికారులపై చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై నిరసన

నవతెలంగాణ-కొండాపూర్



కేంద్ర బీజేపీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో మండలంలోని తిర్పోల్ గ్రామంలో ఆదివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ గ్రామ శాఖ కార్యదర్శి వెంకటేశం మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో రోజురోజుకీ నిత్యవసర సరుకుల ధరలు విపరీతంగా పెరుగుతున్నా యన్నారు. 2014లో ఉన్న ధరలకు నేటి ధరలకు 50 నుంచి 200శాతం వరకు ధరలు పెరిగాయన్నారు. కూరగాయల ధరలు ఈ నెలలోనే 37శాతం పెరిగా యన్నారు. కేంద్ర ప్రభుత్వం పేదలపై భారాలు వేస్తూ.. పెట్టుబడిదారుల కోసం పనిచేస్తున్నదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు సుదర్శన్, రత్నయ్య, రాములు, చంద్రయ్య, గోపాల్, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ విఫలమైందని యువకుడు ఆత్మహత్య

- చిన్నఘణపూర్ శివారులో ఘటన

నవతెలంగాణ-కొల్చారం



ప్రేమ విఫలమైందన్న మనస్థాపంతో యువకుడు చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం కొల్చారం మండలం చిన్న ఘనపూర్ శివారులో వెలుగు చూసింది. గ్రామానికి చెందిన నర్సుపల్లి శంకరమ్మ, బీరప్ప దంపతుల కుమారుడు నర్సుపల్లి లక్ష్మణ్ (20) అదే గ్రామా నికి చెందిన ఓ మైనర్ బాలికను ప్రేమించాడు. ఇరువురు పెళ్లి చేసుకుందామని నిర్ణయించుకుని ఇంట్లోంచి వెళ్లిపోయారు. బాలిక మైనర్ కావడంతో బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కొల్చారం పోలీసులు గతంలో ఇరువురిని పోలీస్ స్టేషన్ కు పిలిచి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇరువురు మేజర్ అయ్యేవరకు వేచి ఉండాలని కౌన్సిలింగ్‌లో చెప్పారు. అప్పటినుండి తన ప్రేమ విఫలం అయిందని మన స్తాపంతో ఉన్న లక్ష్మణ్ గ్రామ సమీపంలోని గొల్ల గుట్ట వద్ద చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందాడు. మృతుని తండ్రి బీరప్ప ఫిర్యాదు మేరకు కొల్చారం ఎస్సై మహమ్మద్ గౌస్ కేసు నమోదు చేసుకుని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఉపాధ్యాయుల 'రియల్' వ్యాపారంపై డీఈఓకి ఫిర్యాదు

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్



నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న కొందరు ఉపాధ్యాయులు, ఉద్యోగులు రాజకీయాలు, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేస్తూ.. పాఠశాలలకు డుమ్మా కొడుతు న్నారని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కొటారి నర్సింలు జిల్లా విద్యాధి.కారికి ఆదివారం వాట్సప్ ద్వారా వినతి పత్రం పంపారు. ఈ సందర్భంగా నర్సింలు మాట్లాడుతూ.. నిబం ధనల ప్రకారం ఉపాధ్యాయులు రియల్ ఎస్టేట్ చేయకూడదని ఉన్నప్పటికీ.. నారాయణఖేడ్ ప్రాంతంలోని కొందరు ఉపాధ్యాయులు ఇష్టారీతిన రియల్ ఎస్టేట్ వ్యాపా రం చేస్తున్నారన్నారు. లక్షల జీతాలు తీసుకుంటూ.. వృత్తిని సరిగ్గా నిర్వహించకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఇదే విషయమై విద్యార్థుల తల్లిదండ్రులు గానీ, ఎవరైనా ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా డీఈఓ వెంటనే స్పందించి.. సదరు ఉపాధ్యాయు లను సస్పెండ్ చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఇకనుంచి ఎవరైనా ఉపాధ్యాయులు పాఠశాలలను విడిచి.. భూ వ్యాపారాల్లో కనిపిస్తే ఫోటోల ఆధారంతో సహా పై అధికారులకు పంపిస్తామన్నారు. కాగా ఈ విషయాన్ని నేడు(సోమవారం) జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు.

మినిమం టైం స్కేల్ త్వరలోనే అమలు

- ఎమ్మెల్సీ రగోతం రెడ్డి



నవతెలంగాణ-సిద్దిపేట

కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్లకు, సీఆర్‌టీలకు, పీజీ సీఆర్‌టీ ఉపాధ్యాయులందరికీ మినిమం టైం స్కేల్ త్వరలో వస్తుందని ఎమ్మెల్సీ కూర రగోతం రెడ్డి తెలిపారు. ఆదివారం పిఆర్టియు భవన్ సిద్దిపేటలో జరిగిన కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్లు , సి ఆర్ టి ఉపాధ్యాయ బృందం తో జరిగిన అత్యవసర సమావేశంలో ఎమ్మెల్సీ మాట్లాడారు. త్వరలో పి ఆర్ టి యు ఆధ్వర్యంలో మినిమం టైం స్కేల్ వస్తుందని, కేర్ టేకర్, కేజీబీవీ అన్ని సమస్యలు పరిష్కారం చేస్తానని తెలిపారు. త్వరలో పీఆర్సీ కూడా ఇప్పిస్తా అన్నారు. కేజీబీవీ అన్ని పాఠశాలలో మౌలిక వసతుల ఏర్పాటు కొరకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పి ఆర్ టి యు టి ఎస్ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లు గారి ఇంద్రసేనారెడ్డి, సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి మదన్ గోపాల్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు లక్కిరెడ్డి విజయ, కేజీబీవీ జిల్లా బాధ్యులు మంజుల, నంగునూరు అధ్యక్షులు పార్థసారథి, దౌల్తాబాద్ అధ్యక్షులు రాజి రెడ్డి పాల్గొన్నారు.

శ్రీశైలం దేవస్థానంలో సిద్దిపేట విద్యార్థుల కళా ప్రదర్శన



నవతెలంగాణ-సిద్దిపేట

శ్రీశైల మల్లికార్జున స్వామి దేవాలయంలో రాత్రి శ్రావణమాసం సందర్భంగా జరిగిన కళ వైభవంలో సిద్దిపేటకు చెందిన శ్రీ భవాని క్లాసికల్ డాన్స్ అకాడమీ గురువు డాక్టర్ జి.భవాని విజయ్, వారి శిష్య బృందం 28 మంది విద్యార్థులతో కళ ప్రదర్శన ప్రదర్శించారు. ఓం నమశ్శివాయ సూత్రం, అమ్మవారిశృతి, ఐగిరి నందిని, వినాయక కౌతమ్, పుష్పాంజలి, ఘననాయక దశావతారాలు, ముద్దుగారే యశోద, శివశృతి, లింగాష్టకం గంగాధర శ్రీశైల నాద మరియు పేరిని నృత్యం, కూచిపూడి అంశాల ప్రదర్శనలు ఇచ్చారు. అనంతరం పాల్గొన్న కళాకారులకు దేవస్థానం ఈవో, నిర్వాహకులు సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు.

బాబోయ్ దోమలు



- మండలంలో పడకేసిన పారిశుధ్యం
- దోమలకు నిలయంగా మండల కేంద్రం
- కానరాని పారిశుధ్య చర్యలు
- వ్యాప్తి చెందుతున్న వైరల్ జ్వరాలు

నవతెలంగాణ-బెజ్జంకి

మండల పరిధిలోని గ్రామీణ ప్రాంతాలలో మురుగు నీరు కాలువల వ్యవస్థ అస్తవ్యస్తంగా మారాయి. కాలువలలో మురికి నీరు నిలవడం,పారిశుధ్య పనులు అస్తవ్యస్తంగా మారడం వల్ల దుర్వాసన వెదజల్లడంతో పాటూ దోమలకు నిలయంగా మారి ఇళ్లల్లోకి వస్తున్నాయని ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. మండల కేంద్రంలో మురుగు నీరు కాలువ వ్యవస్థ అధ్వానంగా మారి ప్రధాన రోడ్డుపై పారుతుండడంతో అవస్థలు పడుతున్నామని రోడ్డు ప్రక్కన ఇళ్ల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తుండడంతో వాహనదారులు,కాలినడకన వెళ్లేవారికి ఇబ్బందులు తప్పడం లేదు.మురికి నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు వ్యాప్తి చెంది అనారోగ్యాలకు గురవుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.దోమలు కుట్టడం వల్ల మలేరియా,డెంగ్యూ, టైఫాయిడ్ వంటి విష జ్వరాలు ప్రభలుతున్నాయని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. మండల,గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే పంచాయతీ కార్యదర్శులు పట్టించుకోకపోవడం వల్లే పారిశుధ్యం పడకేసిందని ప్రజలు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా సంబంధిత జిల్లా, మండలాధికారులు స్పందించి అస్తవ్యస్తంగా మారిన మురుగు నీరు కాలువల్లో దోమల మందు పిచికారీ చేయించాలని దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వామ్మో దోమలు.. బాబోయ్ దోమలంటూ బెంబెలేత్తి పోతున్నారు మండల ప్రజలు. పగలు.. సాయంత్రం..రాత్రంటూ సమయమేమి లేకుండా మండలంలోని ప్రజలు దోమ కాటుకు బలవుతున్నారు. ప్రజారోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబర్చి పారిశుధ్య నిర్వహణ కోసం చెత్త సేకరణ, డ్రైడే, ఫ్రైడే వంటి కార్యక్రమాలతో గొప్ప సంకల్పాన్ని అమలు చేస్తున్నా వాటిని ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోకుండా నీరుగార్చేలా వ్యవహరిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. పారిశుధ్య నిర్వహణపై నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే దోమలు విస్తృతంగా వ్యాప్తి చెందుతూ ప్రజారోగ్యంపై ప్రభావం చూపుతున్నాయని ఇప్పటికైన ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపి కానరాని పారిశుధ్య పనులపై మెరుగైన చర్యలు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

దోమల నివారణకు..

వర్షాకాలంలో మన చుట్టూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. లార్వా దశలోనే దోమల నివారణకు చర్యలు చేపట్టాలి.దోమల నివారణకు మాలథియాన్, సింథటిక్ పైరత్రాయిడ్, డీడీటీ వంటి దోమల మందు మురికి నీరు కాలువల్లో పిచికారి చేయాలి. ఫాగింగ్ మిషన్ల ద్వారా దోమల మందు పొగ పెట్టాలి. నీటి నిల్వల్లో దోమలు వృద్ధి చెందకుండా అబేటు- మందు స్ప్రే చేయాలి. దోమతెరలు వాడటం, ఇంటి కిటికీలకు, తలుపులకు జాలీలు బిగించు కోవాలి. ఇంటిలోపల, బయట నీరు నిల్వలు లేకుండా చూసుకోవాలి.తాగి వదిలేసిన కొబ్బరి బోండాలు, పాత-టైర్లు,ఖాళీ డబ్బా లు, పనికిరాని వస్తువులలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. ఎయిర్ కూలర్లు,ఫ్లవర్ వాజ్,తొట్టిలు, పూలకుండీలలో నీటిని తరచూ మార్చాలి. మురుగు నీరు కాలువల వ్యవస్థను ఎల్లప్పుడూ పరిశీలించి,ఎప్పటి చెత్తను అప్పుడే సేకరించాలి.

ప్రత్యేక చర్యలే లేవు

దోమల నివారణకు ప్రభుత్వాధికారులు ప్రత్యేక చర్యలే చేపట్టడం లేదు.మండల కేంద్రంలో పారిశుధ్యం పూర్తిగా పడకేసింది. దోమలు విస్తృతంగా విజృంభిస్తున్నాయి.ఒక్క క్షణం నిలబడితే దోమల కాటుకు గురవుతున్నాం. ఫాగింగ్ చేసి..దోమలను అరికట్టాల్సిన బాధ్యత గ్రామపంచాయతీ పాలకవర్గం సభ్యులపైన ఉన్న పట్టించుకోవడం లేదు. సాయంత్రం అయ్యిందంటే చాలు దోమలు విపరీతంగా వస్తున్నాయి.ఈ వేళలో ఫాగింగ్ చేయాలని కోరుతున్నాను.పారిశుధ్య నిర్వహణ కొన్ని ప్రాంతాల్లో అధ్వానంగా తయారై చెత్త పేరుకుపోయి అక్కడ దోమలు వృద్ధి చెందుతున్నాయి.ఎప్పటి చెత్త అప్పుడే తీసి వేసే విధంగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి. దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కూడా అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలి.



- బోనగం రాజేశం, బెజ్జంకి

చర్యలు చేపడతాం

విష జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయని ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. వారంలో మూడు రోజుల పాటు ఫాగింగ్ చేయించేల చూస్తాం.వారం రోజుల్లో మురుగు నీరు కాలువల వ్యవస్థను మేరుగు పరుస్తాం.దోమల నివారణకు ప్రజలు కూడా పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలి.దోమల నివారణకు త్వరితగతిన చర్యలు చేపడతాం.



- విష్ణు వర్ధన్, ఎంపీఓ బెజ్జంకి

ఓటు హక్కు నమోదు చేసుకోండి



నవతెలంగాణ-మర్కుక్

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు చాలా విలువైనది, ప్రత్యేక ఓటరు జాబితా సవరణను విడుదల చేసిన నేపథ్యంలో ఓటరు జాబితాకు సంబంధించి ఏవైనా తప్పులుంటే సవరణ చేసేకునే అవకాశాముందని మర్కుక్ తహశీల్దారు చంద్రశేఖర్ రావు సూచించారు. ఆదివారం మండలలోని వర్ధరాజ్ పూర్, దామరకుంట గ్రామాల అంగన్‌వాడీ లకు నూతన ఓటరు లిస్టును,ఓటరు దరఖాస్తు ఫామ్స్ ను బిఎల్వోలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త పునరీక్షణ కార్యక్రమం సెప్టెంబరు 2 , 3,2023 ప్రత్యేక క్యాంపేయిన్ తేదీల్లో అన్ని పోలింగ్ స్టేషన్లలో బూత్ లెవెల్ అధికారి బిఎల్ వో అందుబాటులో ఉంటారని తెలిపారు. నూతన ఓటరు నమోదుకు ఫారం -6 ,ఓటరు జాబితా నుండి పేరు తొలగింపు కోసం ఫారం - 8 అలాగే నివాస ప్రాంతం అడ్రస్ మార్పు కొరకు ఫారం -8 ఏ ను వినియోగించ కోవచ్చునని సూచించారు .అర్హత కలిగిన వారందరూ కూడా ఓటు నమోదు చేసుకోవాలని తెలిపారు. గ్రామాలలో ఏర్పాటుచేసిన బిఎల్వోల ద్వారా ఓటు నమోదు, ఆధార్ లింకేజీ , ఆన్లైన్ ద్వారా ఓట్ల నమోదు ప్రక్రియ గురించి ఆయన వివరించారు. ఓటు హక్కు కోసం దరఖాస్తుకు చివరి తేదీ అక్టోబర్ 31 వరకు ఉందన్నారు.ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, తదితరులున్నారు.

సిరసనగండ్ల గ్రామ కాంగ్రెస్ పార్టీ కమిటీ ఏర్పాటు



నవతెలంగాణ-కొండపాక

కొండపాక మండలం సిరిసనగండ్ల గ్రామ కాంగ్రెస్ పార్టీ కార్యవర్గాన్ని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వాసరి లింగారావు, గ్రామ సర్పంచ్ లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా చెంది కర్ణాకర్, ఉపాధ్యక్షుడిగా డీజే నర్సింలు కార్యదర్శిగా బాబు,సలహాదారు, ప్రశాంత్, యువజన అధ్యక్షుడిగా కనకమల్లు, ఉపాధ్యక్షుడిగా వంశీ,కార్యదర్శి వేముల నరేష్,సలహాదారులు భాను, నరేష్, మైనార్టీ విభాగం అధ్యక్షుడిగా సలీమ్, ఉపాధ్యక్షుడిగా కలీల్, కార్యదర్శిగా అష్రాఫ్‌లతో కమిటీని ఏర్పాటు చేశారు. సిరిసినగండ్ల మాజీ ఎంపీటీసీ నందాల ఆంజనేయులు కాంగ్రెస్ పార్టీలో చేరాడు. ఈ కార్యక్రమంలో గ్రామ సీనియర్ నాయకులు గణపతి రెడ్డి, నర్సింలు, సుధాకర్, ఆరిఫ్, నరేష్, సాయి, విజయ్, భాను, మహేష్ పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తాం

- ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి



నవతెలంగాణ-గజ్వేల్

ముఖ్యమంత్రి కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తామని మెదక్ ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి అన్నారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ ను గజ్వేల్ లో మూడోసారి పోటీ చేస్తున్నారని దీంతో గజ్వేల్ నియోజకవర్గం ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నట్లు ఆయన తెలిపారు. గజ్వేల్ లో రైల్వే లైన్, రింగ్ రోడ్డు, పార్కులు. నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి బీటీ మెటల్ రోడ్డు చేసిన ఘనత కేసిఆర్కే దక్కింది అన్నారు. మహతి ఆడిటోరియం, సమీకృత, మార్కెట్ సమీకృత భవనాలు నిర్మాణం చేపట్టినట్లు ఆయన చెప్పారు. వంద పడకల ఆసుపత్రి జిల్లా ఆస్పత్రి, వంద పడకల చిల్డ్రన్ ఆసుపత్రి నిర్మాణం చేసుకున్న అన్నారు. రైతుబంధు, రైతు బీమా, రుణమాఫీ తదితర సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత తెలంగాణ ప్రభుత్వం అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ తో పాటు గజ్వేల్ నియోజకవర్గ అభివృద్ధిపై రాష్ట్ర ఆర్థిక ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు ప్రత్యేక దృష్టి పెట్టడం వల్లే ఇంత అభివృద్ధి జరుగుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ కు భారీ మెజార్టీ ఇవ్వాల్సిన బాధ్యత గజ్వేల్ ప్రజలపై ఉందన్నారు.

ప్రభుత్వ ఉద్యోగం పొందిన వీఆర్ఏకు సన్మానం



నవతెలంగాణ-కొండపాక

దుద్దెడ గ్రామ వీఆర్ఏగా సుదీర్ఘ కాలం సేవలు అందించి ఇటీవలే ప్రభుత్వ ఉద్యోగం పొందిన మిద్దె కిష్టయ్యను దుద్దెడకు చెందిన రియల్ ఎస్టేట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అటెండర్ గా విధులు నిర్వహించడానికి పంచాయతీరాజ్ శాఖ ద్వారా నియామకం పత్రం అందుకున్న మిద్దె కిష్టయ్య సేవలు గ్రామానికి మరింతగా చేయాలని ఈ సందర్భంగా పలువురు సూచించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు పెద్దంకుల శ్రీనివాస్ గౌడ్, నూనె కుమార్ యాదవ్, గుండెల్లి ఆంజనేయులు, గాజులపాటి శ్రీనివాస్, సురేష్, షాదుల్ హుస్సేన్, బుచ్చిరెడ్డి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

వరాల ప్రశాంత్‌ను అభినందించిన మంత్రి



నవతెలంగాణ-సిద్దిపేట

రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వరాల ప్రశాంత్ మర్యాదపూర్వకంగా మంత్రి హరీశ్ రావును కలిశారు. మంత్రి ప్రశాంతును అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర నర్సింగ్ కౌన్సిల్ మెంబర్ పాల సాయిరాం, నాయకులు వరాల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే కేసీఆర్ లక్ష్యం



- ఎఫ్డిసి చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి

నవతెలంగాణ-గజ్వేల్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై తెలంగాణ రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి సమక్షంలో జగదేపూర్ మండలం బిజి వెంకటాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ బిజెపి పార్టీలకు చెందిన నాయకులు బిఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి గులాబీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ప్రభుత్వం ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ రాష్ట్రంలో చేస్తున్న అభివృద్ధి తెలంగాణ రాష్ట్ర ప్రజలకు అవినీతి లేకుండా అందిస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నుండి బిఆర్ఎస్ పార్టీలో చేరినట్లు ఆయన చెప్పారు. కాంగ్రెస్ పార్టీ నుండి బిఆర్ఎస్ పార్టీలో చేరిన అరిగే భాను, అరిగే యాదగిరి అరిగి సురేష్ తుమ్మ సామి గౌడ రవీ,గౌడ రాజు,గౌడ వరమేష్ ,రామిండ్ల సాయిలు, రామిండ్ల రామస్వామి, అరిగే సందీప్ అరిగే బాబు దళితులలో కాంగ్రెస్ పార్టీ ఖాళీ గజ్వేల్ నియోజకవర్గ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఖాళీ అయ్యిందని, పెద్ద ఎత్తున యువకులు కాంగ్రెస్ పార్టీ నాయకులు రోజురోజు బిఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని వంటేరు ప్రతాప్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో బిజీ వెంకటాపూర్ గ్రామ సర్పంచ్ మంజుల రమేష్, ఎంపిటిసిలో ఫోరమ్ జిల్లా అధ్యక్షుడు కిరణ్ గౌడ్,కొండపొచమ్మ మాజీ డైరెక్టర్ సరేష్,పరమేష్, పార్టీ నాయకులు తదితులున్నారు.

బీసీ కూలాల మండల కన్వీనర్‌గా గుర్రాల స్వామి



నవతెలంగాణ-మర్కుక్

మర్కుక్ మండల బీసీ కులాల ఐక్య వేదిక అడాక్ కమిటీ కన్వీనర్‌గా చేబర్తి గ్రామానికి చెందిన గుర్రాల స్వామి ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు బీసి కులాల ఐక్య వేదిక గజ్వేల్ నియోజకవర్గ కన్వీనర్ గాడిపల్లి భాస్కర్, కో కన్వీనర్ మాజీ జెడ్పిటిసి సింగం సత్తయ్య తెలిపారు. కో-కన్వీనర్లుగా జంపల్లి శ్రీనివాస్ యాదవ్,బోయిని కుమార్,గడీల రాంచంద్రం, దుద్దెడ నాగేష్ గౌడ్,రాపోలు రాముగౌడ్,తదితరులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన నాయకులు మాట్లాడుతూ బీసీ కూలాల ఐక్యత కోసం తమ వంతు కృషి చేస్తామని హమీనిచ్చాలరు.ఈ నెల 5 న గజ్వేల్ లోని ప్రజ్ఞా గార్డెన్ లో నిర్వహించే బిసి కూలల గర్జనను విజయవంతం చేస్తామని,ఈ సమావేశానికి బిసి సంఘాల నాయకులు పెద్ద ఎత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు . ఈ సమావేశంలో సర్పంచ్లు నర్సింలు, లక్ష్మిరాములుగౌడ్, స్వరూపమల్లేశం, అరుణనర్సింలు, జగదేవ్ పూర్ కన్వీనర్ బలరాం ముదిరాజ్, ఎంపిటిసిల ఫోరం మండల అధ్యక్షుడు కావ్యదర్గయ్య, ఉపసర్పంచ్ లు మల్లేశం, మాజీ సర్పంచ్ వైకుంఠం,తదితరులున్నారు.

నూతన వధూవరులను అశీర్వదించిన ఎంపీ



నవతెలంగాణ-తొగుట

వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి ఆశీర్వదించారు. ఆదివారం మండలంలోని వెంకట్రావుపేట గ్రామానికి చెందిన బీఆర్ఎల్ పార్టీ యువజన విభాగం అధ్యక్షులు ఎంగలి రాజు - మానస వివాహం అల్వాల జయ విజయ ఫంక్షన్ హాల్లో జరిగింది. తొగుట మండల కేంద్రానికి చెందిన దార ప్రకాష్ కుమార్తె లిఖిత వివాహం సిద్దిపేటలోని నందాల వెంకట లక్ష్మి గార్డెన్స్ లో జరిగింది.ఈ వివాహాలకు మెదక్ ఎంపీ,దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. మండల బీఆర్ఎస్ పార్టీ అధ్య క్షుడు జీడిపల్లి రాంరెడ్డి,వైస్ ఎంపీపీ బాసిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ దోమల కొమురయ్య,రైతు బంధు మండల అధ్యక్షుడు బోధనం కనకయ్య, ఎంపీటీసీలు కంకణాల నర్సిం లు, సుతారి లలిత రమేష్, కొమ్ము శరత్,నాయకు లు పులి రాజు,కనకయ్య,శ్రీనివాస్ గౌడ్,ఆత్మ కమి టీ డైరెక్టర్ బైరా గౌడ్, సుతారి రాములు, నాయకు లు రాజిరెడ్డి,భాస్కర్ గౌడ్,గణేష్, మహేష్, ఆంజ నేయులు, కనకరాజు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

కురుమల సంక్షేమానికి కేసీఆర్ పెద్దపీట



నవతెలంగాణ- సిద్దిపేటరూరల్

కురుమల సంక్షేమం కోసం కేసీఆర్ ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని సర్పంచ్ సదాశివ రెడ్డి అన్నారు. ఆదివారం సిద్దిపేట రూరల్ మండలం బుస్సాపూర్ గ్రామంలో రెండో విడుతలో భాగంగా 28 మంది లబ్దిదారులకు గొర్రెలు పంపిణీ చేయడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గొల్ల కురుమలకు అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ గొర్రెల యూనిట్ల పంపిణీ చేయడం జరుగుతుంది అన్నారు. గ్రామంలో మొదటి విడతలో 28 మందికి పంపిణీ చేయగా రెండవ విడితలో 28 మంది కి మొత్తం 56 మందికి గొర్రెలు పంపిణీ చేయడం జరిగింది అన్నారు.మంత్రి హరీష్ రావుకు ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఎర్ర ఎల్లం , కుర్మ సంఘం అధ్యక్షుడు బైతి కనకయ్య, మల్లయ్య, బిరయ్య భూమయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మెదక్ జిల్లాకు గద్దర్ పేరు పెట్టాలి



- డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్

నవతెలంగాణ-రాయపోల్

అణగారిన పీడిత ప్రజల గొంతుక ప్రజా యుద్ధ నౌక గద్దర్ పేరు మెదక్ జిల్లాకు పెట్టాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ డిమాండ్ చేశారు. ఆదివారం రాయపోల్ మండలం బేగం పేట,వడ్డేపల్లి గ్రామాలలో ఈ నెల 10 నుండి చేయనున్న సామాజిక పరివర్తన పాదయాత్ర పై ప్రచారం చేసారు.ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ గద్దర్ మెతుకు సీమలో పుట్టి ప్రపంచ వ్యాప్తంగా మెదక్ జిల్లాకు గుర్తింపు తెచ్చారన్నారు.రాష్ట్ర ప్రభుత్వం గద్దర్ అంతక్రియలను అధికారికంగా నిర్వహించి గౌరవంగా సాగనంపిందన్నారు.మెదక్ జిల్లాకు గద్దర్ పేరు పెట్టి గౌరవించాలని కోరారు. సామాజిక పరివర్తన పాదయాత్రలో భారత రాజ్యాంగాన్ని ఇంటి ఇంటికి ప్రచారం చెస్తామన్నారు.అదేవిధంగా హక్కులు, చట్టాలు, ప్రభుత్వ పథకాల పై ప్రజలకు అవగహన కల్పిస్తామన్నారు. బాబాసాహెబ్ అంబేద్కర్ పోరాడి సాధించిన ఓటు హక్కు పై చైతన్యం కల్పిస్తామన్నారు. పాఠశాలలను, హాస్టల్ లను సందర్శించి సమస్యలను గుర్తిస్తామన్నారు. రైతులను, కూలీలను కలుస్తామన్నారు. సామజిక పరివర్తన పాదయాత్రను విజయవంతం చేయాలని కోరారు. సమావేశాలలో డిబిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు, బేగంపేట్ అంబేద్కర్ సంఘం నాయకులు కళ్ళెం ప్రకాశ్, ప్రశాంత్, భూపాల్, వినయ్, మహిపాల్, రాజు, శ్రావణ్, స్వామి, బాను, శ్రీకాంత్, వడ్డెపల్లి అంబేద్కర్ సంఘం నాయకులు చిరంజీవి, రవి, స్వామి పాల్గొన్నారు.

సీసీరోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన



నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల మండల పరిధిలోని పాత దొమ్మాట గ్రామంలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి ఎంజిఎన్ఆర్ జిఎస్ నిధులు రూ.10 లక్షల వ్యయం తో నిర్మించే సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆదివారం సర్పంచ్ సుభాషిణి తో కలిసి చేర్యాల ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్ శంకుస్థాపన చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ మండలంలోని ప్రతి ఎంపీటీసీ కి గ్రామాల అభివృద్ధికి రూ.10 లక్షల చొప్పున ఎమ్మెల్సీ శ్రీనివాస్ రెడ్డి మంజూరు చేశారని, ఈ సందర్భంగా ఎమ్మెల్సీకి ఋణపడి ఉంటామని అన్నారు. వైస్ ఎంపీపీ తాంద్ర నవీన్ రెడ్డి, ఎంపిటిసి ముచ్చంతల వినోద-సుక్కా రెడ్డి,ఎంపీటీసీ ల ఫోరం మండల అధ్యక్షుడు గూడూరు బాలరాజు, మండల నాయ కులు మిట్టపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఏనుగుల లక్ష్మీ నరసయ్య, వార్డు సభ్యులు వెలుముల నర్సిం లు, మహిళా అధ్యక్షురాలు మంజుల, రాములు, దుబాల లక్ష్మారెడ్డి,ఒంటెర్పుల నర్సింలు, వెంకట నరసింహారెడ్డి, దప్పు నర్సింలు, వెలుముల రాజు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
5
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
సోమవారం | సెప్టెంబర్ 04 2023 | www.navatelangana.com

ఓపెన్ జిమ్ ప్రారంభించిన చింతా ప్రభాకర్



నవతెలంగాణ-సంగారెడ్డి: సంగారెడ్డి పట్టణంలోని 26వ వార్డు మగ్దూంనగర్‌లో కౌన్సిలర్ షేక్ సాబేర్ అధ్వర్యంలో ఓపెన్ జిమ్‌ను టీఎస్‌హెచ్‌డీసీ చైర్మన్ చింతా ప్రభాకర్ ఆదివారం ప్రారంభించారు. వార్డు సభ్యులు బాణసంచాలు కాల్చి చింతా ప్రభాకర్ కి ఘన స్వాగతం పలికారు. కౌన్సిలర్ సాబేర్ మాట్లాడుతూ సంగారెడ్డి నియోజకవర్గ ప్రజలకు 24గంటలు అందుబాటులో ఉంటున్న వ్యక్తి చింతా ప్రభాకర్ అని అన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ చింతా ప్రభాకర్ కృషితో సీఎం కేసీఆర్, మంత్రి హరీష్ రావు సహకారంతో సంగారెడ్డి పట్టణం అభివృద్ధి చెందుతుందన్నారు. చింతా ప్రభాకర్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ సంగారెడ్డి మున్సిపాలిటీకి రూ.50 కోట్లు మంజూరు చేయుగా ప్రజలకు అవసరం ఉన్న చోట పనులు పెట్టడం జరిగిందన్నారు. రూ.20 కోట్లు టి.ఎఫ్.ఐ.డి.సి కింద నిధులు మంజూరుతో వార్డులో అత్యవసరాలు గుర్తించి పనులు పూర్తి చేసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సి డి సి చైర్మన్ విజేందర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, మైనార్టీ నాయకులు అంజద్ తదితరులు పాల్గొన్నారు.

సైక్లింగ్ పోటీలకు ఎంపికపై హర్షం



నవతెలంగాణ-కోహెడ

మండలంలోని గుండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన దండవేని శ్రీచరణ్ జిల్లాస్థాయి కేలో ఇండియా సెంటర్ సైక్లింగ్ పోటీలకు ఎంపిక కావడం పట్ల ఎంపీటీసీ సుతారి కళ్యాణి కనుకరాజు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దిపేట ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న శ్రీచరణ్ క్రీడలలో ఉన్నత రంగాలను అందిపుచ్చుకొని గ్రామానికి మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం శ్రీచరణ్‌ను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుతారి కనుకరాజు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మామిడి శ్రీనివాస్, యూత్ అధ్యక్షులు కోనవేని కిషన్, తదితరులు పాల్గొన్నారు.

నాకు మంత్రి ఆశీస్సులు

- డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం
- సంగారెడ్డి బీఆర్ఎస్ అభ్యర్థిని మార్చే వరకు పోరాటం

నవతెలంగాణ-సంగారెడ్డి

మంత్రి ఆశీస్సులు నాకు ఉన్నాయని, బీఆర్ఎస్ సంగారెడ్డి ఎమ్మెల్యే అభ్యర్థి మార్చే వరకు పోరాటం ఆగదని ఉమ్మడి మెదక్ జిల్లా డిసిసిబి వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం అన్నారు. ఆదివారం పట్నం మాణిక్యం యువసేన సంగారెడ్డి నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశానికి భారీ ఎత్తున సంగారెడ్డి నియోజకవర్గం నుండి భారీ ఎత్తున అభిమానులు కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఆయనకు ఘన స్వాగతం పలికి శాలువాల, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. నియోజవర్గం సంబంధించిన కొండాపూర్ ఎంపీపీ మనోజ్ రెడ్డి, వైయస్ఆర్పీపీ జిల్లా అధ్యక్షులు గౌరీ రెడ్డి శ్రీధర్ రెడ్డి, మల్లేశం మాట్లాడుతూ సంగారెడ్డి నియోజకవర్గం లో బీ ఆర్ఎస్ అభ్యర్థిగా చింత ప్రభాకర్ అభ్యర్థిత్వాన్ని మార్చాలని ఆయన స్థానంలో పట్నం మాణిక్యానికి ఇవ్వాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. ఎట్టి పరిస్థితుల్లో చింతా ప్రభాకర్ సహకరించబోమని తేల్చి చెప్పారు. ప్రతి విషయంలో చింతా ప్రభాకర్ వల్ల నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. పట్నం మాణిక్యం ప్రజల మధ్య ఉంటూ, తన ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్న వ్యక్తి కి ఇవ్వాలని మంత్రి హరీష్ రావు, కెసిఆర్ కు కోరుతున్నాం అని అన్నారు. ఈ సందర్భంగా పట్నం మాణిక్యం మాట్లాడుతూ నా మీద అభిమానంతో ఇంతమంది కార్యకర్తలు , శ్రేయోభిలాషులు రావడం హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. పట్నం మాణిక్యం ప్యాకేజీల కోసం అమ్ముడుపోయే వ్యక్తి కాదని, తనను కొనే శక్తి ఎవరికీ లేదని ఆయన అన్నారు. కంఠంలో ఊపిరి ఉన్నంతవరకు అమ్ముడు పోయే వ్యక్తి కాదని అన్నారు. హరీష్ రావు ఆశీస్సులు నాకు ఉన్నాయని వెల్లడించారు. కెసిఆర్ హరీష్ రావు నాయకత్వంలో పనిచేస్తామని అన్నారు. డబ్బులు ఇస్తే వచ్చిన వాళు కాదు నా మీద అభిమానంతో వచ్చిన వాళ్ళు అని మీ అందరికీ రుణపడి ఉంటానని అన్నారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ మాదిరిగా ఎమ్మెల్యే బీ ఆర్ఎస్ బి ఫామ్ సాధించేవరకు మా పోరాటం ఆగదని అన్నారు. పదివేల సైన్యాన్ని తయారు చేస్తానని అన్నారు. ఎవ్వరికి భయపడే వాని కాదని అన్నారు. పట్నం మాణిక్యం,పులిమామిడి రాజు, ఆత్మకూరు నాగేష్, డాక్టర్ శ్రీహరి, మాలో ఎవరికీ ఇచ్చినా దగ్గరుండి గెలిపించుకుంటానని ఆయన అన్నారు. బీ ఆర్ఎస్ అభ్యర్థి చింత ప్రభాకర్ అభ్యర్థిత్వాన్ని మార్చాలని తెలిపారు. ఈనెల 22 నా పుట్టినరోజు నుండి ప్రణాళికతో ప్రతి మండల లోని గ్రామాల పట్టణాలలో ప్రజల వద్దకు వెళ్తానని తెలియజేశారు. అన్ని పదవులు చింత ప్రభాకర్ కు ఎలా ఇస్తారని ఆయన ప్రశ్నించారు. ఆయనకు ఆరోగ్యం సహకరించకపోయినా ఎందుకు ఎమ్మెల్యే టికెట్ ప్రకటించారని ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రకటించిన ఐదు, ఆరు నియోజకవర్గాలలో మారుతాయని అందులో సంగారెడ్డి కూడా ఉందని అన్నారు. నాకు అన్ని విధాలుగా అర్హత దమ్ము ధైర్యం ఉందని సంగారెడ్డి టికెట్ ఇవ్వాలని ఆయన కోరారు. ఆఖరి క్షణం వరకు టికెట్ కోసం పోరాడుతానని తనకే టికెట్ వస్తుందని మంత్రి హరీష్ రావు ఆశీస్సులు నాకు ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్నం మాణిక్యం యువసేన నాయకులు పట్నం రవి, బిక్షపతి, శ్రీనివాస్ రెడ్డి, అశోక్, అతిక్, మాణిక్ రెడ్డి, రామచందర్, ప్రభాకర్, మహమూద్ అలీ, చంద్రసేన్, విశ్వనాథ్, శ్రీశైలం, మల్లేశం, బుచ్చయ్య, ప్రకాష్, ప్రేమానందం, పోచయ్య, మల్లేశం పాల్గొన్నారు.





మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా జట్ల ఎంపిక

నవతెలంగాణ-మద్దూరు

మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా జట్లను ఎంపిక చేయనున్నట్లు మద్దూరు ఎంఈఓ మొగుళ్ల నర్సింహారెడ్డి ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 4 న మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ పాఠశాలలో అండర్ 14, 17 కబడ్డీ, ఖోఖో,వాలీబాల్ క్రీడలకు ఎస్ జి ఎఫ్ మండల స్థాయి జట్లను ఎంపిక చేయనున్నట్లు ఆయన తెలిపారు అండర్ 14 విభాగంలో 1,1,2010 నుండి 2017 మధ్యలో జన్మించి ఉండాలి క్రీడల లో పాల్గొనే ఆసక్తిగల విద్యార్థిని విద్యార్థు లు ఉదయం 10 గంటలకు మోడల్ స్కూల్ లో ఉండాలని ఆయన కోరారు.

బదిలీ దరఖాస్తులను మళ్ళీ అప్డేట్ చేయాలి

నవతెలంగాణ-సంగారెడ్డి

గత ఫిబ్రవరిలో విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం బదిలీల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసిన ప్రతి ఉపాధ్యాయుడు.. ప్రస్తుతం విద్యా శాఖ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం బదిలీ కోరుకునే ప్రతీ ఉపాధ్యాయుడు తిరిగి ఆన్‌లైన్‌లో అప్లికేషన్‌ను అప్డేట్ చేసుకోవాలి. ఫిబ్రవరిలో అప్లై చేసిన ప్రతీ ఉపాధ్యాయుడు తిరిగి ఈనెల 3,4,5 తేదీలల్లో అప్లికేషన్‌ను అప్డేట్ చేయాలి. గతంలో ఆన్‌లైన్‌లో సమర్పించిన దరఖాస్తులో సవరణలు, మార్పులను ౯ తీఖఅంటవతీం.ంంవ్.వశ్రీఖఅస్త్రుఅఖ.స్త్రశీఙ.అఅ వెబ్‌సైట్ ద్వారా చేసుకోవచ్చు. ఈ సైట్‌లో ఫోన్ నంబర్, ట్రెజరీ నంబర్ ఆధార్ నంబర్లను ఎంట్రీ చేసిన తర్వాత ఓటిపి వస్తుంది, ఓటిపిని నమోదు చేస్తే పాత అప్లికేషన్ డిస్‌ప్లే అవుతుంది. అప్లికేషన్‌లో ఏవైనా మార్పులు ఉంటే అప్డేట్ చేయాలి. ఆటోమేటిక్ అప్డేట్ ఆప్షన్ లేదు కాబట్టి తిరిగి దరఖాస్తు చేయాలి. అప్డేట్ చేసిన తర్వాత 4 ప్రింట్స్ తీసుకోవాలి. కొత్తగా బదిలీకి దరఖాస్తు చేసుకునే వారు కూడా ఇదే వెబ్సైట్ ద్వారా అప్లై చేసుకోవచ్చు.

వివాహ వేడుకలో పాల్గొన్న జర్నలిస్టు సంఘాల నాయకులు



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ పట్టణంలోని రంజోల్ తవక్కల్ కళ్యాణ మండపంలో సీనియర్ విలేఖరి నర్సింలు సోదరుడి కూతురు నందిని, శివకుమార్ల వివాహం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. జర్నలిస్టు సంఘాల నాయకులు శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్ శాస్త్రి, అశోక్ కుమార్, మహబూబ్ అలీ, అహ్మద్, శ్రీను, నర్సింలు, రాచన్నలతోపాటు వివిధ పార్టీల నాయకులు, ప్రముఖులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన మంత్రి



నవ తెలంగాణ - సిద్దిపేట

పట్టణ పోలీసు కన్వెన్షన్ హాల్‌లో చిన్నకోడూర్ ఎంపీపీ కూర మాణిక్‌రెడ్డి కూతురు వివాహ వేడుకలో హాజరై నూతన వధూవరులను రాష్ట్ర మంత్రి హరీశ్‌రావు ఆశీర్వదించారు. రెడ్డి ఫంక్షన్ హాల్ లో భీంరెడ్డి వారి పెండ్లి, వయోల గార్డెన్స్ లో ఇట్టబోయిన వారి వివాహ వేడుకలో, వడ్డేపల్లి దయానంద్ ఫంక్షన్ హాల్ లో నీరుగంటి వారి పెళ్లి సందడిలో, చంద్రమౌళి ఫంక్షన్ హాల్ లో గజ్జెల వారి వివాహ వేడుకలో, 6వ మున్సిపల్ వార్డు కౌన్సిలర్ వడ్లకొండ సాయి కుమార్ అన్న వడ్లకొండ హరీష్-ఏసబ వివాహం ఇటీవల జరిగగ, ఈ మేరకు గణేశ్ నగర్ లోని వారి నివాసంలో నూతన దంపతులను కలిసిన ఆశీస్సులు అందించారు. పట్టణ తాడూరి ఫంక్షన్ హాల్ లో కోడూరు వారి పెండ్లి సందడిలో, కొండా భూదేవి గార్డెన్స్ లో నర్మెట్ట వారి పెళ్లి వేడుకలకు హాజరై నూతన వధూవరులకు ఆశీస్సులు అందించారు.



నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల పట్టణ కేంద్రంలో ఆదివారం జరిగిన పలు వివాహ వేడుకలకు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాసరెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం షాదీఖానాలో బీఆర్ఎస్ కార్యకర్తలు, అభిమానులను కలుసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో మూడోసారి బీఆర్ఎస్ గెలిచి హ్యాట్రిక్ సాధిస్తుందని ఎమ్మెల్సీ అన్నారు. కార్యక్రమంలో చేర్యాల ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్,వైస్ ఎంపీపీ తాండ్ర నవీన్ రెడ్డి, బీఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మంగోలు చంటి, కౌన్సిలర్ ఆడెపు నరేందర్, మాజీ ఎంపీపీ మేడిశెట్టి శ్రీధర్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు గూడూరు బాలరాజు, మహిళా సంఘం పట్టణ మాజీ అధ్యక్షురాలు పచ్చిమడ్ల మానస, మండల కో ఆప్షన్ సభ్యుడు ఎండీ. నాజర్,మాజీ ఎంపీటీసీ బందెల మహిపాల్ రెడ్డి, శనిగరం లక్ష్మణ్, గంధ మల్ల రవి, అవుశెర్ల కిషోర్, మిట్టపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఏనుగుల లక్ష్మీ నర్సయ్య,ఏర్పుల మహేష్,ఎస్.కె.అఖిల్, కామిడి రమేష్ రెడ్డి, బొమ్మగోని శ్రీనివాస్‌గౌడ్, చంద శ్రీకాంత్, బాచి, కాలకేయ తదితరులు పాల్గొన్నారు.

ఎన్పీఆర్డీ జిల్లా కమిటీ ఎన్నిక





నవతెలంగాణ-సంగారెడ్డి

ఎన్పీఆర్డీ జిల్లా నూతన కమిటీ ఆదివారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా ఏ.మాణిక్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తాళ్ళ మల్లేశం, అధ్యక్షులుగా బస్వరాజు పాటిల్, ప్రధాన కార్యదర్శిగా టి.గోపాల్, ప్రచార కార్యదర్శిగా మన్నె పోచయ్య, కోశాధికారిగా బుక్క ఇస్మాయిల్, ఉపా ధ్యక్షులుగా నాగయ్య, సునీత, సాయమ్మా, అఫ్సర్, నర్సింలు శ్రీశైలం, గోపాల్ రెడ్డి, గఫార్, సహాయ కార్యదర్శులుగా జయలక్ష్మి, సంగమేశ్వర్, ప్రకాష్ రావు, కిష్టయ్య, శోభ, వెంకయ్య, శోభ రాణి, అశ్వక్ కమిటీ సభ్యులు: సుధాకర్, రాములు, అంజయ్య, బాలయ్య, సత్యనారాయణ, నర్సింలు, అఫ్సర్, రమాదేవి, రామచందర్, లక్ష్మి, ఫర్జానా, బాబు, రాజు, బబునాయక్, రాథోడ్ శంకర్, సురేష్, తుకారాం, మల్లయ్య స్వామి తదితరులు ఎన్నిక అయ్యారు. అనంతరం గృహలక్ష్మి పథకంలో వికలాంగులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, డబుల్ బెడ్ రూం ఇండ్లు కేటాయించాలని జిల్లా కమిటీ తీర్మానించింది.

పుట్టగొడుగుల్లా..ప్రథమ చికిత్స కేంద్రాలు

- మండలంలో ఇష్టారాజ్యంగా మెడికల్ మాఫియా
- నిబంధనలు తుంగలో తొక్కి ఆసుపత్రుల ఏర్పాటు
- వైద్యుల అర్హతలను పరిశీలించే వ్యవస్థే లేదు
- తప్పుడు పత్రాలతోనే వైద్యం చేస్తున్నారని ఆరోపణలు
- రోగుల నుంచి అధికంగా బిల్లుల వసూలు
- పెషేంట్లను రిఫర్ చేస్తే ఆర్ఎంపీలకు భారీగా నజరానాలు

నవతెలంగాణ- కొల్చారం

మెదక్ జిల్లా కొల్చారం మండలంలో వైద్యం వ్యాపారంగా మారి పోయింది. అర్హతలు ఉన్నా లేక పోయినా వైద్యం చేసే వారిపై అజమా యిషీ చేసే నాథుడే లేరు. దీంతో చాలా మంది వైద్యాన్ని అంగట్లో వ్యాపారంగా మార్చి అందినకాడికి దండుకుంటున్నారు. మాఫీయా తరహాలో గ్రామాల్లో విస్తరించిన వైద్యుల వ్యాపార నెట్ వర్క్ విషయంలో మెడికల్ కౌన్సిల్ పట్టింపు లేక పోవడంతో వారి వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలు అన్న చందంగా కొనసాగుతోంది. వాస్తవానికి వైద్యుల విద్యార్హతలకు సంబంధించి ఎప్పటికప్పుడు తనిఖీలు చేపట్టి పర్యవేక్షించేందుకు సరైన వ్యవస్థ లేక పోవడం రోగుల పాలిట శాపంగా మారుతోంది. వాణిజ్య కేంద్రమైన రంగంపేట గ్రామంలో ఏకంగా ఏడు ప్రథమ చికిత్స కేంద్రాలు, ఐదు మెడికల్ షాపులు స్థాపించడం ఇందుకు నిదర్శనం అని చెప్పుకోవచ్చు. ఇందులో ఏ ఒక్కరికీ విద్యార్హతలు లేకుండానే వైద్యం చేస్తున్నారన్న ఆరోపణలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. అదేవిధంగా

ఆర్ఎంపీ, పీఎంపీలు, మెడికల్ షాప్ యజమానులు సిండికేట్ గా మారి ఉన్నతాధికారులకు పెద్ద మొత్తంలో ముడుపులు చెల్లిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీటన్నంటిని పరిగణలోకి తీసుకుంటే నర్సింగ్ హోంల పేరిట యథేచ్ఛగా సాగుతున్న వైద్య వ్యాపారం మాటున అమాయక రోగుల నిలువు దోపిడీ జరుగుతుందన్న విమర్శలున్నాయి. అచ్చిరాని వైద్యంతో చికిత్సలు చేస్తుండటం పట్ల అమాయక ప్రజలు ఎందరో ప్రాణాలు విడిచిన పరిస్థితులు ఉన్నాయని ప్రజలు వాపోతున్నారు. అయినా ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం, వైద్యం పట్ల పట్టించుకోకపోవడం గమనార్హం.



మారుమూల గ్రామాల్లో..

మారుమూల గ్రామాల పరిధిలో వైద్య సేవల లభ్యత అంతంత మాత్రంగానే అందు బాటులో ఉన్నాయి. ప్రయివేటు నర్సింగ్ హోంల నిర్వాహకులకు ఇదే మంచి అవకాశంగా మారింది. ముఖ్యంగా నర్సింగ్ హోం తెరిచిన వైద్యులు గ్రామీణ ప్రాంతాల్లో ఉండే ఆర్ఎంపీలు, పీఎంల నెట్ వర్క్‌పైనే ఆధార పడి రోగుల సంఖ్యను



పెంచుకుంటున్న పరిస్థితి ఉందని చెబుతున్నారు. గ్రామాల్లో చిన్న చిన్న జబ్బులకు వైద్య సేవలు అందించే ఆర్ఎంపీలు కాస్త క్రిటికల్ అనుకున్న కేసులను తమకు అనుసంధానంగా ఉండే నర్సింగ్ హోంలకు రిఫర్ చేస్తుంటారు. ఆయా నర్సింగ్ హోంలు ఇచ్చే పర్సంటేజీలు పుచ్చుకొని రోగులను రెఫర్ చేస్తుండడం ఈ ప్రాంతంలో సర్వసాధారణమని చెబుతున్నారు. ఈ క్రమంలో అవసరం లేక పోయిన రోగులను రెఫర్ చేయడం, అలా రెఫర్ చేసి రోగుల నుంచి పరీక్షల పేరిట స్కానింగ్‌ల పేరిట వేలల్లో ఫీజులు గుంజి నర్సింగ్ హోంలు ఆర్థిక దోపిడీకి పాల్పడుతున్నాయని చెబుతున్నారు.

పేద కుటుంబాలకు ఆర్థిక సాయం

నవతెలంగాణ-మద్దూరు: మండలంలోని నర్సాయపల్లి గ్రామానికి చెందిన రాచకొండ లచ్చవ్వ అనారోగ్యంతో మృతి చెందారు. మృతురాలి కుటుంబానికి మద్దూరు ఎంపీపీ బద్దిపడగ కృష్ణారెడ్డి 20 వేల రూపాయలు పంపించారు. సర్పంచ్ బద్దిపడగ లలిత కృష్ణారెడ్డి మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి 20 వల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామానికి ఎంపీపీ ఇచ్చిన మాట ప్రకారం గ్రామంలో ఎవరైనా మృతి చెందితే వారి దహన సంస్కారాలకు 20వేల రూపాయల ఆర్థిక సహాయం అందిస్తున్నాడని ఆమె తెలిపారు .ఈ కార్యక్రమంలో చేర్యాల మార్కెట్ కమిటీ డైరెక్టర్ శనిగరం సత్యనారాయణ, బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు తౌటి యాదగిరి, మాజీ ఎంపీటీసీ దేవరాజుల కనకమ్మ, చంద్రయ్య,వార్డు సబ్యులు శ్రీనివాస్ కనకయ్య మహేందర్, పోశయ్య ,రేషన్ డీలర్ బాదల్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-తొగుట: పెద్ద మసాన్ పల్లి సేవా కమిటీ మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు. ఆదివారం పెద్ద మాసాన్ పల్లి మధిర గ్రామం వడ్డెర కాలనీకి చెందిన బోదాసు శ్రీనివాస్ ఇటీవల మృతి చెందా డు.ఈ విషయం తెలుసుకున్న సేవ కమిటీ సభ్యు లు రూ.7500 ఆర్థిక సహాయం,50 కేజీల బియ్యం మృతుని కుటుంబానికి అందజేశారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ మానవత్వం తరిగి పోతున్న రోజుల్లో తోటి వారికి మా కుటుంబ సభ్యు లుగా భావించి సహృదయంతో, ప్రేమతో,మానవ త్వంతో సహకారం అందించామని తెలిపారు. ఆ కుటుంబానికి సహాయం చేసి వాళ్లకు ఆత్మస్థైర్యం ,ధైర్యం కల్పిస్తామని పేర్కొన్నారు.

నవతెలంగాణ-కొండపాక

కొండపాక మండలం నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన నిరుపేద అకారం మల్లయ్య కుమార్తె వివాహం నిమిత్తం గ్రామానికి చెందిన పాశం వేమారెడ్డి పాపిరెడ్డి పుస్తె మెట్టలను ఆదివారం అందజేశారు. ఆయన వెంట పిఎసిఎస్ డైరెక్టర్ సెల్ బాల్ నరసయ్య, దర్గా సాయి ప్రసాద్ గౌడ్, తేలు కిషన్, ఆకారం బాలరాజ్ ఉన్నారు.

నవతెలంగాణ-నంగునూరు: నంగునూరు మండలం ఖాతా గ్రామానికి చెందిన రొడ్డ రఘునాధ్‌రెడ్డి(46) ఇటీవలే మృతి చెందారు. ఈ విషయాన్ని రెడ్డి సంఘం సభ్యులకు తెలియజేశారు. ఆదివారం స్పదించిన రెడ్డి సంఘం అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు దారం భగవాన్ రెడ్డి, కమిటీ, రెడ్డి సంఘం సభ్యులు, గ్రామ సర్పంచ్ చల్ల దశమంత రెడ్డి తదితరులు వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.రెడ్డి సంఘం తరపున ఐదు వేల రూపాయల సహాయం అందజేశారు.

నవతెలంగాణ-గజ్వేల్ : ప్రజ్ఞాపూర్ కి చెందిన చిన్ననాటి మిత్రుడు తన కూతురు వివాహానికి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని వాట్సప్ గ్రూప్ ద్వారా తెలుసుకున్నాం. దీంతో పూర్వపు జిల్లా ప్రజా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రజ్ఞాపూర్ 1992-1993 బ్యాచ్ పదవ తరగతి మిత్రులు అందరూ కలిసి తమ వంతు ఆర్థిక సహాయంగా రూ.82 వేలు అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. 30 సంవత్సరాల తర్వాత మిత్రుని కూతురు వివాహంలో కలుసుకున్న మిత్రులు పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

నవతెలంగాణ-ములుగు: ములుగు మండలం పరిధిలోని బహిలింపూర్ గ్రామానికి చెందిన కొట్టాల స్వామి అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న ములుగు మండల యాదవ







సంఘం అధ్యక్షులు బలేష్ యాదవ్ కుటుంబాన్ని పరామర్శించి ఐదువేల రూపాయల ఆర్థిక సహాయం చేశారు. కార్యక్రమంలో కిరణ్







యాదవ్ రాజు గౌడ్ వార్డు నెంబర్ మల్లేష్ దయ్యం యాదగిరి దయ్యం రమేష్ ఇస్మాల్ మియా ,బాబు, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు